teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 196 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 13 జనవరి 2026 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## ఫిబ్రవరి 1న లోక్‌సభలో కేంద్ర బడ్జెట్


జనవరి 28 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక ప్రకటన


06



## ప్రభుత్వ ఉద్యోగులకు సంక్రాంతి కానుక






### డీఏ పెంచుతూ సర్కార్ కీలక నిర్ణయం

### 33.67 శాతానికి పెరిగిన కరువు భత్యం

### 2023 జూలై నుంచి వర్తింపజేస్తూ ఉత్తర్వులు

తెలంగాణ బ్యూరో, జనవరి 12 (తీన్మార్ న్యూస్): సంక్రాంతి పండుగ పూట ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం భారీ శుభవార్త చెప్పింది. ఉద్యోగులకు డీఏ పెంచింది. 30.03 శాతం నుంచి 33.67 శాతానికి డీఏను సవరణ చేసింది. 2023 జులై 1వ తేదీ నుంచి డీఏ అమలు కానుంది. జిల్లా పరిషత్ మున్సిపాటీ ఉద్యోగులకు, యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కూడా డీఏ వర్తించనుంది. ఈ జనవరి జీతంతో కలిపి డీఏ చెల్లించనుంది. జులై 2023 నుంచి డిసెంబర్ 2025 వరకు ఉన్న బకాయిలు అన్నీ చెల్లించనుంది. బకాయిలను జీపీఎఫ్ ఖాతాల్లో వేయనుంది. రిటైర్ అయ్యే ఉద్యోగులకు 30 విడతల్లో బకాయిలు చెల్లించనుంది. పార్ట్ టైం అసిస్టెంట్లు, వీఆర్ఏలకు నెలకు రూ.100 అదనంగా చెల్లించనుంది. నేడో, రేపో దీనికి సంబంధించిన జీవో అధికారికంగా వెలువడుతుంది. దీనివల్ల ప్రభుత్వంపై నెలకు రూ. 227 కోట్ల అదనపు భారం పడుతున్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## ఉచిత ల్యాప్‌టాప్‌ల పంపిణీ వార్త నకిలీ

స్టూడెంట్స్ ల్యాప్‌టాప్ స్కీమ్ 2026 పై కేంద్రం స్పష్టీకరణ




- సోషల్ మీడియా సందేశాలను నమ్మకండి
- పౌరులను హెచ్చరించిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో

న్యూ ఢిల్లీ, జనవరి 12 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం స్టూడెంట్స్ ల్యాప్‌టాప్ స్కీమ్ 2026 కింద ఉచిత ల్యాప్‌టాప్‌లను అందిస్తున్నట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వ్యాపించే సందేశాన్ని ప్రభుత్వం తోసిపుచ్చింది. ఆ సందేశంలో ప్రభుత్వం గ్రహీతలు తమ వ్యక్తిగత వివరాలను పంచుకోవాలని

మిగతా 2 లో

## కొత్త జిల్లాలను రద్దు చేస్తే అగ్గి రాజేస్తాం

కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై కేటీఆర్ నిప్పులు


06

మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో బీఆర్ఎస్ తరపున గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు.




సినిమా టికెట్ల ధరల పెంపుపై

## మంత్రి వెంకట్‌రెడ్డి యూ-టర్న్

మాట మార్చిన సినిమాటోగ్రఫీ మంత్రి

హరీశ్ రావు వ్యాఖ్యలపై ధ్వజం

.. వివరాలు 2లో



## చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి సంక్రాంతి గిఫ్ట్

సివిల్ సూట్ అంటే ఏళ్లు గడిచినా ముగియని కథ

పోలవరం నల్లమల సాగర్ వివాదంపై హరీశ్ రావు నిప్పులు

.. వివరాలు 2లో



## మేడారం మహా జాతర ప్రచార పర్వం ప్రారంభం

- బ్రోచర్, వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్
- పాల్గొన్న మంత్రులు సీతక్క కొండా సురేఖ
- జనవరి 28 నుంచి 31 వరకు మేడారం జాతర

హైదరాబాద్, జనవరి 12 (తీన్మార్ న్యూస్): ఆసియాలోనే అతిపెద్ద గిరిజన ఉత్సవం సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతర ప్రచార కార్యక్రమాలు అధికారికంగా మొదలయ్యాయి. తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ మహా జాతర జరగనున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా, జాతర కోసం ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్, వాల్ పోస్టర్‌ను

మిగతా 2 లో

## మేడారంలో తెలంగాణ కేబినెట్ భేటీ..?


02

- జనవరి 18న సీఎం అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- సంప్రదాయానికి భిన్నంగా గిరిజన గడ్డపై నిర్ణయాలు
- 19న అమ్మవార్ల నూతన ప్రాంగణాల ప్రారంభోత్సవం
- తొలి దర్శనం రేవంత్‌రెడ్డిదే

## మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు ప్రాతినిధ్యం

- ప్రభుత్వ ఉద్యోగాలు.. ఇండ్లు కూడా ఇస్తాం
- తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే ఉద్యోగుల జీతంలో కోత
- సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయాలు


06



## హైదరాబాద్‌లో సంక్రాంతి సంబరాలు

ఆకాశంలో గాలిపటాల విన్యాసాలు

గచ్చిబౌలిలో డ్రోన్ షోల హంగామా



హైదరాబాద్, జనవరి 12 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ నగరం ఈ సంక్రాంతికి రంగుల పండుగగా మారనుంది. గాలిపటాల నుంచి హాట్‌ఎయిర్ బెలూన్ల వరకు, డ్రోన్ ప్రదర్శనల వరకు నగరవాసులకు అరుదైన ఆకాశ వినోదాన్ని

మిగతా 2 లో



## పోలవరం - నల్లమల ప్రాజెక్టుపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

రిట్ పిటిషన్ ఉపసంహరించుకున్న తెలంగాణ ప్రభుత్వం

న్యూఢిల్లీ, జనవరి 12 (తీన్మార్ న్యూస్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన వివాదాస్పద పోలవరం - నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ప్రాజెక్టును సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను చట్టపరమైన సాంకేతిక

మిగతా 2 లో



## రేవంత్ సర్కార్‌కు నీటి సోయి లేదు

పోలవరం - నల్లమల ప్రాజెక్టుపై కవిత ఘాటు విమర్శలు

06

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో భారీ అవినీతి

**కాంగ్రెస్ పాలనలో "మంటగలిసిన మానవత్వ విలువలు"**

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి**

**అర్హులను పక్కనపెట్టి ఇళ్లను అమ్ముకున్నారని ఆరోపణ**

**కాంట్రాక్టులు, ఉద్యోగాల వివక్షపై గండ్ర ఆగ్రహం**



భూపాలపల్లి, జనవరి 12 (తీన్మార్ న్యూస్): గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో భూపాలపల్లిలో మానవత్వ విలువలు పూర్తిగా క్షీణించాయని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి విమర్శించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు డ్రా పద్ధతిలో కేటాయించా మని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులను పక్కనపెట్టి అనర్హులకు ఇళ్లను అమ్ముకున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ, సీసీ రోడ్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. సింగరేణిలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, దబాయింపులతో పాలన సాగిస్తూ సంస్థను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని, వారసత్వ ఉద్యోగాలు, కాంట్రాక్టుల విషయంలో అన్యాయం జరుగుతోందన్నారు. గణపురం అభివృద్ధిపై ఉన్న శ్రద్ధ భూపాలపల్లి మున్సిపాలిటీపై ఎందుకు లేదని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ప్రజలు కాంగ్రెస్ మోసాలను గుర్తించి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.



# మేడారంలో తెలంగాణ కేబినెట్ భేటీ..?



తెలంగాణ బ్యూరో, జనవరి 12 (తీన్మార్ న్యూస్): ఈనెల 18న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. సంప్రదాయానికి భిన్నంగా ఈసారి మేడారంలో నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా సచివాలయంలో జరిగే ఈ అత్యున్నత స్థాయి సమావేశం ఈ సారి మేడారంలో నిర్వహిచాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరు పొందిన మేడారం సమ్మక్క- సారలమ్మ మహా జాతర ఈ నెల 28 నుంచి ప్రారంభం కాబోతోంది. ఈ జాతరకు ముందు మేడారంలో కేబినెట్ భేటీ నిర్వహించేందుకు యోచిస్తున్నట్లు సమాచారం. అలాగే జనవరి 18న ఉదయం ఖమ్మం నగరంలో మున్సిపల్ ఎన్నికల ప్రచార సభ నిర్వహించి మధ్యాహ్నం మేడారంలో కేబినెట్ భేటీ జరిగే అవకాశం ఉంది. ఆ రాత్రి మేడారంలోనే సీఎం రేవంత్ బస చేయనున్నట్లు సమాచారం. 19న ఉదయం అమ్మవార్ల నూతన ప్రాంగణాల ప్రారంభించి తొలి దర్శనం చేసుకుంటారు. అనంతరం హైదరాబాద్‌కు చేరుకుని సాయంత్రం దావోస్ కు ప్రయాణం కానున్నట్లు తెలుస్తోంది. మేడారం జాతర ఏర్పాట్లు, రాబోయే బడ్జెట్ సమావేశాలు, ఆర్థిక పరిస్థితిన్నిలు, రాష్ట్రంలో నీటి వాటాల అంశంతో పాటు తాజా పరిణామాలపై కేబినెట్ చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# హైదరాబాద్‌లో సంక్రాంతి సంబరాలు

మొదటి పేజీ తరువాయి



అందించేందుకు ప్రత్యేక వేడుకలు సిద్ధమయ్యాయి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నేటి నుంచి గురువారం వరకు అంతర్జాతీయ గాలిపటం, స్వీట్స్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాగే ఈ వేడుకల్లో వివిధ దేశాల గాలిపటాలు, సంప్రదాయ మిఠాయిల స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకోనున్నాయి.

### హాట్‌ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

అదే వేదికగా జనవరి 16 నుంచి 18 వరకు హాట్‌ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ జరగనుంది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రంగురంగుల బెలూన్లు ఆకాశంలో విహరిస్తూ నగరానికి పండుగ శోభను తీసుకొచ్చేందుకు నిర్వహకులు ప్లాన్ చేశారు.

### గచ్చిబౌలి స్టేడియంలో డ్రోన్ ఫెస్టివల్

ఇక గచ్చిబౌలి స్టేడియంలో జనవరి 16-17 తేదీల్లో డ్రోన్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి రాత్రి 8 గంటల వరకు సాగనున్న ఈ కార్యక్రమంలో ఆధునిక సాంకేతికతతో రూపొందించిన డ్రోన్ షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. సంప్రదాయం, ఆధునికత కలయికగా నిర్వహించే ఈ వేడుకలు నగరవాసులకు మరిచిపోలేని సంక్రాంతి అనుభూతిని అందించనున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు రంగులు, సంస్కృతి, ఆకాశ విన్యాసాలతో హైదరాబాద్ సంక్రాంతి సంబరాలు ఈ సారి ప్రత్యేకంగా నిలవనున్నాయి.

# సినిమా టికెట్ల ధరల పెంపుపై "మంత్రి వెంకటీ రెడ్డి యూ-టర్న్"

హైదరాబాద్, జనవరి 12 (తీన్మార్ న్యూస్): సినిమా టికెట్ ధరల పెంపుపై సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట మార్చారు. తాను సినీ పరిశ్రమ గురించి పట్టించుకోవడమే మానేశానని టికెట్ ధరల పెంపు గురించి వస్తున్న జీవోలకు నాకు ఎలాంటి సంబంధం లేదని కొద్ది రోజుల క్రితం సంచలన వ్యాఖ్యలు చేసిన మంత్రి సోమవారం అందుకు భిన్నంగా మాట్లాడారు. టికెట్ ధరల పెంపు విషయంలో అంతా కూర్చొని మాట్లాడుకున్న తర్వాతే నిర్ణయం తీసుకున్నామని అన్నారు. పుష్ప-2 ఘటన తర్వాత టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని నేను, ముఖ్యమంత్రి ప్రకటించిన మాట వాస్తవమేనని అయితే ఆ తర్వాత తామంతా మాట్లాడుకుని నిర్ణయాన్ని సవరించుకున్నామన్నారు. ఒక వేళ టికెట్ ధరలు పెంచాల్సి వస్తే 20 శాతం సినీ కార్మికుల సంక్షేమానికి ఇవ్వాలనే షరతుతో టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతి ఇస్తున్నామన్నారు. ఇందుకు అనుగుణంగా ఇటీవల కొన్ని సినిమాలకు హైక్ ఇస్తే కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసిందని ఆ సమయంలో తాను హైదరాబాద్ లో లేనన్నారు. అయితే తనకు తెలియకుండానే టికెట్ ధరలు పెంచుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేయడంపై మాజీ మంత్రి హరీశ్ రావు స్పందిస్తూ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిస్థితి చూస్తే జాలేస్తోందని అన్నారు. హరీశ్ రావు చేసిన ఈ వ్యాఖ్యలపై తాజాగా ఓ న్యూస్ చానల్ తో మాట్లాడుతూ ఈ విధంగా స్పందించారు.




### మిమ్మల్ని చూస్తే జాలేస్తోంది:

మంత్రిని చూస్తే జాలేస్తోందన్న వ్యాఖ్యలపై స్పందించిన కోమటిరెడ్డి మా మీద కాదు మిమ్మల్ని చూస్తేనే మాకు జాలేస్తోందన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క ఎంపీ సీటు గెలవలేదని, సిద్దిపేటలో కూడా రెండువేల మెజారిటీ బీజేపీకి వచ్చిందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో 20 శాతం కూడా గెలవలేదని విమర్శించారు. ఇది సర్కారా సర్కసా అని హరీశ్ రావు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని వారి మాటలకు సమాధానం ఇచ్చేందుకు మాకు సమయం లేదన్నారు. బీఆర్ఎస్ నేతలకు పని లేదని అందువల్లే ప్రతిరోజు విమర్శలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రుల శాఖల్లో జోక్యం చేసుకోరని వైఎస్ఆర్ మాదిరిగా అందరిని కలుపుకుపోతారని చెప్పారు.

### మంత్రిగారు ఇదేం పని:

కాగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెంకట్ రెడ్డి రాజకీయాల్లో పరిచయం అక్కర్లేని పేరు. ఉమ్మడి రాష్ట్రంలోనే మంత్రిగా చేసిన కోమటిరెడ్డి తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారి కేబినెట్ లోకి అడుగుపెట్టారు. అయితే విషయం ఏదైనా తన రూట్ సపరేటు అని చాటుకునే కోమటిరెడ్డి వైఖరి ఇటీవల సొంత పార్టీ నేతలు, అభిమానులకు షాక్ ఇస్తోంది. ముందు ఏది పడితే అది మాట్లాడటం ఆ తర్వాత నాలుక మడతెట్టడం రివాజు అన్నట్లుగా ఆయన తీరు మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సినిమా టికెట్ ధర పెంపు విషయంలో తన వద్దకు ఎవరూ రావడం లేదని నేనసలు ఆ శాఖను పట్టించుకోవడమే మానేశానని బహిరంగంగానే చెప్పిన కోమటిరెడ్డి ఇప్పుడు మాట మార్చడం చర్చగా మారింది. ఇదిలా ఉంటే గత నెలలోనూ మంత్రి వ్యవహరించిన తీరు ఇదే రకంగా విమర్శలు వ్యక్తం అయ్యాయి. పవన్ కల్యాణ్ కోనసీమ కొబ్బరి చెట్లు-నరదృష్టి వ్యాఖ్యలపై స్పందిస్తూ పవన్ కల్యాణ్ భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసిన వెంకట్ రెడ్డి ఆ తర్వాత మూడు రోజులకే విజయవాడకు వెళ్లి మాట మార్చారు. అప్పటి పరిస్థితులను బట్టి తాను అలా మాట్లాడానని నేను ఎవరిని విమర్శించనంటూ కామెంట్ చేశారు. దీంతో ఒకే విషయంలో రోజుకో మాట పూటకో డైలాగ్ తో కోమటిరెడ్డి రాజకీయాల్లో తనకున్న బ్రాండ్ ను తానే విమర్శల పాలు చేసుకుంటున్నారనే టాక్ వినిపిస్తోంది.

# ఉచిత ల్యాప్‌టాప్‌ల పంపిణీ వార్త నకిలీ

మొదటి పేజీ తరువాయి




అడుగుతోందని పేర్కొంది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో యొక్క ఫ్యాక్ట్-చెక్ యూనిట్ ఈ వాదన నకిలీదని మరియు స్కామ్‌లో భాగమని తెలియజేసింది. ప్రభుత్వం అలాంటి పథకాన్ని ప్రకటించలేదని యూనిట్ జోడించింది. పిబ్ కూడా పౌరులు అలాంటి పథకాలకు పాల్పడవద్దని కోరింది మరియు అధికారిక ప్రభుత్వ వనరుల ద్వారా మాత్రమే వార్తలను తనిఖీ చేయాలని సూచించింది.

# చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి సంక్రాంతి గిఫ్ట్

హైదరాబాద్, జనవరి 12 (తీన్మార్ న్యూస్): విచారణ అర్హత లేని పిటిషన్ వేసి ఏపీ ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న పోలవరం-నల్లమల సాగర్ కు పూర్తి స్థాయిలో సహకరిస్తున్న రేవంత్ రెడ్డి నిజస్వరూపం, ద్రోహ బుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలైందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో రైతులతో రిట్ వేయించి మరీ ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టుకు స్టే సాధిస్తే, ఇక్కడి చేతగాని కాంగ్రెస్ సర్కారు మాత్రం ఉద్దేశపూర్వకంగానే విచారణ అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఈ మాత్రం విషయం మీ న్యాయవాది, మీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వికి తెలియదా.. ఈ మాత్రం దానికి నీళ్ల మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సూటు బూటు వేసుకొని ఢిల్లీ వరకు వెళ్లాలా.. అని ప్రశ్నించారు. పోలవరం -నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో సోమవారం రిట్ పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంపై హరీశ్ రావు ఓ ప్రకటన ద్వారా స్పందించారు.

### చంద్రబాబుకు రేవంత్ రెడ్డి సంక్రాంతి గిఫ్ట్:

ముఖ్యమంత్రిగా ఉంటూ మన నీటి హక్కులను ఏపీకి దారాదత్తం చేస్తూ రేవంత్ రెడ్డి తెలంగాణకు చేస్తున్న చారిత్రక ద్రోహం ఇది అని రిట్ ఉపసంహరించుకొని, సివిల్ సూట్ ఫైల్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పడం అంటే, పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టు కట్టుకోవడానికి ఏపీకి గడువు ఇవ్వడమేనన్నారు. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక వాదనలు కూడా వినడం అనేది ఏండ్లు గడిచినా ముగియని కథేనన్నారు. ఈ లోగా ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులు పూర్తి చేసుకొని, తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ అప్పనంగా నీళ్లను తరలించుకు పోతుందన్నారు. సంక్రాంతి పండుగ వేళ రేవంత్ చంద్రబాబుకు ఇచ్చిన గిఫ్ట్. సుప్రీం కోర్టులో వేసిన ఈ బలహీనమైన రిట్టు అని ఆరోపించారు. పోలవరం నల్లమల సాగర్ విషయంలో ముందు నుంచి రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి పూర్తిగా సహకరిస్తోందని దుయ్యబట్టారు. 'పోను పోను అనుకుంటూనే రేవంత్ రెడ్డి ఆనాడు ఢిల్లీ మీటింగ్‌కు వెళ్ళారు. ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపారు. పెట్టబోను అంటూనే సంతకం పెట్టి తెలంగాణ నదీ జలాలకు మరణశాసనం రాశారు. వేయను అంటూనే కమిటి వేసి ఏపీ జల దోపిడీకి రెడ్ కార్పెట్ వేశారు. టెండర్ చివరి తేదీ అయిపోయాక సుప్రీం కోర్టు కు వెళ్ళి నల్లమల సాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపారు. పస లేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమల సాగర్ కు మద్దతు ప్రకటించారు అని విమర్శించారు.

### నిన్ను తెలంగాణ సమాజం క్షమించదు:

మేం నిలదీస్తే బనకచర్లను అడ్డుకుంటాం, సుప్రీంకోర్టుకు వెళ్తాం అని నమ్మ బలికిన రేవంత్ రెడ్డి, నేడు కావాలనే బలహీనమైన పిటిషన్ వేసి తెలంగాణకు మోసం చేశాడని మండిపడ్డారు. పంచాయతీలు వద్దు, న్యాయస్థానాలు వద్దు మనమే కూర్చొని చర్చించుకుందాం అన్న రేవంత్ రెడ్డి మాటల అంతర్యం ఏమిటి? తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్ప చెప్పడమేనా మీ చర్చల లక్ష్యం? తెలంగాణలోని కృష్ణా, గోదావరి నదులపై చంద్రబాబు, ఆంధ్రా ప్రభుత్వం అడ్డుకోని ప్రాజెక్టులు ఏమైనా ఉన్నాయా? అలాంటి చంద్రబాబుతో దోస్తీ కట్టి, తెలంగాణకు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్ రెడ్డి నిన్ను తెలంగాణ సమాజం క్షమించదని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి మీ గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే తెలంగాణను సాధించిన బిఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని నీ దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం పోరు చేస్తామన్నారు.

# మేడారం మహా జాతర ప్రచార పర్వం ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ ప్రచారం ద్వారా జాతర విశిష్టతను, ఏర్పాట్లను భక్తులకు తెలియజేయనున్నారు. ఈ మహా జాతర బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. వారితో పాటు పలువురు పార్లమెంట్ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు కూడా హాజరై, జాతర విజయవంతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలుస్తోంది. కాగా ఈ మహా జాతరకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర జనవరి 28 నుంచి జనవరి 31 వరకు నాలుగు రోజుల పాటు జరగనుంది.

### జాతర ముఖ్యమైన తేదీలు

- జనవరి 28 (బుధవారం): సారలమ్మ, గోవిందరాజు మరియు పగిడిద్దరాజులు గద్దెలపైకి చేరుకుంటారు.
- జనవరి 29 (గురువారం): చిలకలగుట్ట నుంచి సమ్మక్క తల్లి గద్దెపైకి వస్తుంది. ఇది జాతరలో అత్యంత కీలకమైన ఘట్టం.
- జనవరి 30 (శుక్రవారం): భక్తులు అమ్మవార్లకు మొక్కులు (బంగారం/బెల్లం) చెల్లించుకునే ప్రధాన రోజు.
- జనవరి 31 (శనివారం): అమ్మవార్ల వనప్రవేశం (తిరుగు ప్రయాణం)తో జాతర ముగుస్తుంది.



# జిల్లాలో యూరియా కొరత లేదు

**571 కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా**

**రెండు లక్షల 23వేల 53 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ**

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతిలో రాష్ట్రలో 5వ స్థానంలో జిల్లా**




మహబూబాబాద్ జిల్లా, జనవరి 12 (తీన్మార్ న్యూస్): జిల్లాలో యూరియా కొరత లేదనీ (571) కేంద్రాలు అందులో (112), ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, రైతు సేవ ఆగ్రోస్, హక్క సెంటర్, ఒడిసెమ్) ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలు, (439) ప్రవేట్ డీలర్స్, సహకార శాఖ అదనపు కేంద్రాలు (20) ప్రతీ కేంద్రానికి మూడు సేల్స్ పాయింట్ల ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని, ఇప్పటివరకు సుమారు 30 వేల మెట్రిక్ టన్నులు సరఫరా చేసినట్లు, జనవరి మాసంలో 10 వేల మెట్రిక్ టన్నులు, సరఫరా చేయడం జరిగిందని, ఇంకా 4 వేల మెట్రిక్ టన్నులు జిల్లాలో రైతులకు అందుబాటులో ఉందని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని సరిత తెలిపారు. 25- 26 సంవత్సరం ఖరీఫ్ సీజన్లో 2 లక్షల 89 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యంకాగా ఇప్పటికే 2 లక్షల 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఐకెపి (73), ప్రాథమిక సహకార సంఘాలు (167), గిరిజన కార్పొరేషన్ (12), మెప్మా (1), మొత్తం (253), కేంద్రాల ద్వారా 44 వేల 789 మంది రైతుల నుండి సేకరించి సుమారు 537 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమచేయడం జరుతుందని, బోనస్ 104.39 కోట్ల బోనస్ నిధులు రైతుల ఖాతాల్లో జమచేయడం జరుతుందని, జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి రమేష్, మేనేజర్ కృష్ణవేణి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతిలో రాష్ట్రలో 5వ స్థానంలో జిల్లా ఉందని జిల్లాలో 10670 లక్ష్యం కాగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం కమిటీ ప్రభుత్వ సూచనల ప్రకారం (10181), మంజూరు చేయడం జరిగిందని, మిగిలిన ఇండ్లు పరిశీలనలో ఉన్నాయని, మార్కవుట్ చేసినవి (8481), బెస్మిట్ వరకు వచ్చినవి, (7336), గోడల వరకు వచ్చినవి (4892), స్లాబ్ వరకు వచ్చినవి (2667), పూర్తి స్థాయిలో గృహ నిర్మాణం పూర్తి చేసి ప్రవేశం జరిగినవి (37), వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు సుమారు 150 కోట్ల 74 లక్షల నిధులు లబ్ధిదారులకు చెల్లించడం జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా జిల్లా 86% పురోగతితో ఐదో స్థానంలో నిలిచిందని అందులో, డోర్నకల్ నియోజకవర్గంలో 91 శాతం, మహబూబాబాద్ నియోజకవర్గం 89, శాతం, ములుగు నియోజకవర్గం 61 శాతం, పాలకుర్తి 88, శాతం, ఇల్లందు నియోజకవర్గ 87 శాతం, ఉందని, ఆగస్టు, సెప్టెంబర్ మాసంలో రెండవ స్థానం, అక్టోబర్ మాసంలో మూడవ స్థానం, నవంబర్ డిసెంబర్ మాసాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 5వ స్థానంలో వివిధ దశల్లో ఉన్నందుకు గాను రాష్ట్ర హౌసింగ్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి గౌతమ్ జిల్లాను ప్రశంసించారని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ హనుమాన్ నాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని సరిత, పౌరసరఫరాల శాఖ అధికారి, రమేష్,మేనేజర్ కృష్ణవేణి, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇందిరమ్మ ఇండ్లు హన్మనాయక్ లు మాట్లాడారు. జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జిల్లాస్థాయి ప్రత్యేక అధికారుల నిత్య పర్యవేక్షణలో జిల్లాలో యూరియా పంపిణీ, ధాన్యం కొనుగోలు నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం అమలు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని, యూరియా పంపిణీ కేంద్రాలలో రైతులకు కావాల్సిన ఏర్పాట్లు త్రాగునీరు టెంట్లు చైర్స్, అదనపు క్యూలైన్లు తదితర సదుపాయాలను ఏర్పాటుచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని సంబంధిత అధికారులు సోమవారం తెలిపారు.

# ముున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం



పరకాల, జనవరి 12 (తీన్మార్ న్యూస్): పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. 20వ వార్డులో సన్నహక సమావేశంలో పాల్గొన్న పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీ సోదా రామకృష్ణ వార్డు ఇంచార్జ్ గోపతి రవి యాదవ్, 20వ వార్డులో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం ఈరోజు వార్డు అధ్యక్షులు బొచ్చు సాల్మన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం ఏర్పాటు చేయగా వార్డు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి వారి అభిప్రాయాలను తెలియపరుస్తూ ఎన్నికల సమయంలో ఎలా ముందుకు వెళ్లాలి అనే ఆలోచనలతోటి అలాగే ఓట్ల ఇన్చార్జిలను నియమించాలని ఎవరికి కాంగ్రెస్ పార్టీ బిఫాం ఇచ్చిన కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ, వార్డు ఇన్చార్జి గోపతి రవి యాదవ్ లు అన్నారు. ఈ కార్యక్రమంలో లక్క వసంత, రేండ్ల సంపత్, బొచ్చు శ్రీనివాస్, ఆశాల నర్సిరెడ్డి, రవ్వ సదానందం, ఇల్లందుల అశోక్, వెన్నంపెల్లి నాగరాజ్, లక్కం శంకర్, పెగడ రాజు, సిహెచ్ సమ్మయ్య, సాదు జయ్, అమరగంటి సమ్మయ్య, రాజన్న, సుచిత్ర, ప్రమోద్ కుమార్, సోమేశ్వర్, పద్మ, వీరస్వామి, సాంబయ్య, అజిత్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటా: చల్లా ధర్మారెడ్డి



గీసుగొండ, జనవరి 12 (తీన్మార్ న్యూస్): కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ కంటికిరెప్పలా కాపాడుకుంటామని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని గీసుగొండ మండలం కొమ్మాల గ్రామ బిఆర్ఎస్ యూత్ నాయకులు ఏపూరి నరేష్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా

వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 12 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి మొత్తం 46 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రజావాణిలో వచ్చిన అన్ని దరఖాస్తులు రానున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నారని, అందువల్ల అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో పర్యవేక్షణ లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు స్వామి వివేకానంద బోధనలు మార్గదర్శకం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 12 (తీన్మార్ న్యూస్): యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించడంలో స్వామి వివేకానంద బోధనలు మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. సోమవారం జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత లక్ష్యసాధనలో పట్టుదలతో ముందుకు సాగాలని, సమాజ సేవను తమ జీవిత లక్ష్యంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. వివేకానందుని ఆలోచనలు నేటి యువతకు దిశానిర్దేశకమని, విద్య, క్రీడలు, సేవా కార్యక్రమాల ద్వారా సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, యువజన సర్వీసులు క్రీడల శాఖ అధికారి రఘు, ఆర్డీఓ హరికృష్ణ, యువజన సర్వీసులు శాఖ సిబ్బంది సాగర్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తరాతరాలకు ఆదర్శం స్వామి వివేకానంద

**బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్**



హనుమకొండ, జనవరి 12 (తీన్మార్ న్యూస్): ఎన్ని తరాలు మారిన స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి గానే ఉంటారని "బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషను వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. సోమవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా హనుమకొండలోని ఫౌండేషన్ కార్యాలయంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పులి దేవేందర్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు భారత దేశ ఔన్నత్యాన్ని తెలియజేసిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని అన్నారు. యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని సమాజంలో గుర్తింపు పొందాలని తెలిపారు. ప్రతి ఒక్కరు చదువు పై దృష్టి పెట్టాలని విద్య ద్వారా ఏదైనా సాధించవచ్చని అన్నారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు గరిపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆర్థిక ఎదుగుదల కూడ ఎంతో ముఖ్యమని అందుకోసం యువత అందివచ్చిన ప్రతి అవకాశంను సద్వినియోగం చేసుకుంటూ ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించాలని అన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు,సీనియర్ జర్నలిస్ట్ బోనాల రమేష్, విద్యావేత్త పొన్నం రాజు లు సంయుక్తంగా మాట్లాడుతూ ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకోవాలని, అందుకోసం కష్టనష్టాలను ఓర్చుకొని అనుకున్న లక్ష్యాన్ని చేరేవరకు విశ్రమించవద్దని అన్నారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన లావణ్యను పలువురు అతిథులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా గరిపెల్లి శ్రీనివాస్, కొయ్యడ లక్ష్మణ్,డోలి రాజ్ కుమార్, మామిడాల అనిల్, పెంచాల అశోక్, పొన్నం రాజు, బోనాల రమేష్, నీరటి రాజు లతో పాటు ఫౌండేషన్ సభ్యులు జన్ను రాజమౌళి, హైమ రాణి, మేడిపల్లి అనిల్, రాధిక, అనుముల శ్రీలత, రవి, హంస సురేందర్,స్రవంతి, పవన్, కొక్కు సౌజన్య, బలుగూరి మౌనిక, పైండ్ల అనిత,ఊడుగుల దేవేంద్ర, గొల్ల నరేందర్, కత్తి మౌనిక, లక్కారుసు పవన్, సూర మంజుల, జిల్లా రజిత, శ్రవణ్ కుమార్, పర్నే సరస్వతి,కన్న మనీషా, పొన్నం అక్షయ, వినోద్, నరేష్,నవీన్ కుమార్, విజయ్ కుమార్, మిరియాల రమేష్, స్పందన, కృష్ణ, సురేష్, అశోక్ లతో పాటు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# సర్పంచ్ అభ్యర్థిని వెంటనే తొలగించాలి

**ప్రజావానిలో కలెక్టర్ కు పిర్యాదు**

భూపాలపల్లి, జనవరి 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో కాటారం మండలం గుండ్రాతిపల్లి గ్రామపంచాయతీకి సంబంధించి ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో తప్పుడు బీసీ కుల ధ్రువీకరణ పత్రం సమర్పించి గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థిని వెంటనే తొలగించాలని, అలాగే రెండవ స్థానంలో నిలిచిన గోనే ముకుందని సర్పంచ్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ప్రజావాణి కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ గారికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, గోనే ముకుంద మరియు పార్టీ జిల్లా నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవి పటేల్ మాట్లాడుతూ, గుండ్రాతిపల్లి గ్రామంలో ప్రస్తుత సర్పంచ్ అభ్యర్థి ఎన్నికల సమయంలో సమర్పించిన నామినేషన్ అఫిడవిట్, కుల ధ్రువీకరణ పత్రం తప్పుడు వివరాలతో కూడినవని, వాటిని జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులు తక్షణమే తనిఖీ చేసి, తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాన్ని పరిగణనలోకి తీసుకొని ఆ సర్పంచ్ అభ్యర్థిత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులకు స్పందిస్తూ ఈ అంశంపై తప్పకుండా సమగ్ర విచారణ (ఎంక్వయిరీ) నిర్వహిస్తామని, బాధితులకు న్యాయం చేస్తామని, అలాగే అధికారులను తప్పుదోవ పట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని రవి పటేల్ తెలిపారు. అలాగే, ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించకపోతే, తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న స్వయంగా భూపాలపల్లికి వచ్చి జిల్లా కలెక్టర్ తో నేరుగా మాట్లాడతారని కూడా ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికీ న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ప్రజాపోరాటాలకు దిగుతామని, మీడియా ముఖంగా అధికారులను రవి పటేల్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## ఇంచార్జీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



మహబూబాబాద్ జిల్లా, జనవరి 12 (తీన్మార్ న్యూస్): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే సత్వరమే పరిష్కరించాలని ఇంచార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. సోమవారం అన్ని విభాగాల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జీ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగాల కు పంపి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సోమవారం వివిధ విభాగాలకు చెందిన మొత్తం (66) ప్రజావాణి దరఖాస్తులు వచ్చాయన్నారు,

బూర్గు పాడు గ్రామము డోర్నకల్ మండలం మహబూబాబాద్ జిల్లా చెందిన కొందరు రైతులు బూర్గు పాడు చెరువు అలుగు నుండి ఉయ్యాలవాడ చెరువు కు వెళ్లే గొలుసు కట్టు కాలువ అక్రమంగా ధ్వంసం చేసి కాలువ భూమిని కబ్జా చేశారని న్యాయం చేయాలని దరఖాస్తు చేశారు. బానోతు.మహేష్ అనే బొల్లెపల్లి గ్రామ సర్పంచ్ గూడూరు మండలం, మహబూబాబాద్ జిల్లాలో మా గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం లేదు కావున మా గ్రామానికి పంచాయతీ భవనం మంజూరు చేయగలరని కోరనైనది, చిన్న వంగర గ్రామం పెద్ద వంగర మండలం జిల్లా మహబూబాబాద్ కు చెందిన ఒక్క మహిళ గత పది సంవత్సరాల నుండి ఇప్పటి వరకు ధరణిలో కలిగిన సాంకేతిక కారణాలు వలన నాకు ఎల్ పి ఎస్ ల్యాండ్ పట్టాదారు పాసుబుక్ రాలేదని నాకు పట్టాదారు పాసు బుక్ మంజూరు చేయగలరని కోరనైనది. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పి సీఈవో పురుషోత్తం, బీసీ,మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, ఎల్డిఎం యాదగిరి, వెల్ఫేర్ అధికారిని సబిత, మెప్మా ప్రాజెక్ట్, సివిల్ సప్లై కృష్ణవేణి, డీఎస్ఓ రమేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, అన్ని విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

## సమావేశంలో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య



హనుమకొండ, జనవరి 12 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. ప్రజలు కాంగ్రెస్‌పై పెట్టుకున్న విశ్వాసాన్ని మరింత పటిష్టం చేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే పదవుల కోసం కాదు, ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసే సిద్ధాంతబద్ధమైన పార్టీ అని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలదేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ మరింత బలపడేలా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నియోజకవర్గ ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. కాజీపేట బ్రిడ్జి, నాలా సమస్యల పరిష్కారం, వరద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి ఎన్నో కీలక పనులను విజయవంతంగా చేపట్టారని తెలిపారు. నాయిని రాజేందర్ రెడ్డి అవినీతి రహిత పాలనను అందిస్తూ, ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నారని ప్రశంసించారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ ఎస్ నాయకులు రౌడీయిజం, అరాచక రాజకీయాలకు పాల్పడ్డారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అజెండా పూర్తిగా అభివృద్ధి, ప్రజా సంక్షేమమేనని స్పష్టం చేశారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతి డివిజన్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డివిజన్ పర్యటనను విజయవంతం చేసి, పార్టీ బలాన్ని మరింత పెంచాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం నేడు ప్రియాంక గాంధీ పుట్టిన రోజు సందర్భంగా వారికి ఎంపీ డా. కడియం కావ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దేశ రాజకీయాల్లో ప్రజల సమస్యలపై నిలబడి పోరాడుతున్న నాయకురాలిగా వారి సేవలు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# "సమాధి - స్మశానం"

ఊరు బయిటా
పాడుపడ్డ ప్రదేశం కాదది
ఎముకల కుప్పల
చితాభస్మాలా ప్రసాదం
మరణం లేని ప్రదేశం
అదే స్మశానం
సమాధి నిన్నొక పసివాడిలా
ఆశ్చర్యానికి నెడుతుంది
కాసింతైన తీరిక లేని నీ జీవన
గమనాల చివరి గమ్యం
ఎంతటి హాయినిస్తుందో
కదూ...!!!
సందేహల్లేవ్... స్వప్నాల్లేవ్...
ఆశల్లేవ్... విశ్వాసాల్లేవ్...
ప్రశ్నలకు తావే లెదక్కడా...
సమాధానాలకై ఆరాటం
లెదక్కడా...
సమస్యలన్నీ పరిష్కరించబడిన
ప్రదేశం...
అప్రమత్తతే అవసరం
లేని గాఢ నిద్దుర...
ఏకాంతం తో ప్రేమలో
పడే మధుర క్షణాలు...
నీ ఘ్నననంతా కాల్చి బూడిద
చేసి నిన్ను నిర్జీవంగా లాలించే
ఒక అద్భుతం
నీ తల మీన బరువునంతా
భారరహితం చేసే
ఒక గొప్ప సంపూర్ణ నిశ్శబ్దం...
సుడిగాలులా
ధూమరానికేమోకానీ
ఒకానొక వేసవి రాతిరి
అణచివేతకు గురైన బతుకుల
ఆత్మలు ఇక్కడా...ప్రేతాత్మలై
ఘోషిస్తున్నాయి....
తెగిన కన్న పేగులిక్కడా
స్మశానానికి తోరణాలైనై....
వీడిన అమర ప్రేమిక
వాలుజడలు
ఇక్కడ మాడి మసై
పోయినాయి
ఈ భస్మ స్థల సమూహం
భీకరంగా కాలిపోతూ....
బూడిదవుతూ....
మళ్ళీ మళ్ళీ
ఊపిరోసుకుంటానంటున్నాయి

**రచన:సురేష్ నూనేటి**
**9676457297**
**ఉమ్మడి వరంగల్**



# వయోవృద్ధుల కొరకు ప్రణమ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్



ములుగు జిల్లా, జనవరి 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారము జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రమునందు గల సంక్షేమ భవనం నందు గల సమావేశ మందిరం నందు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వయోవృద్ధుల కొరకు ప్రణమ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 12 -01 -2026 నాడు వర్చువల్ గా ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం నందు జిల్లా సంక్షేమ శాఖ అధికారి తులా రవి, రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ములుగు జిల్లా నుండి వైస్ చైర్మన్ జి శ్రీనివాస్, ట్రెజరర్ ఎస్ సతీష్, కార్యదర్శి సిహెచ్ రమేష్, రెడ్ క్రాస్ మెంబర్ పి నాగరాజు, జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు రామ్మూర్తి ఉపాధ్యక్షులు ఐలయ్య మరియు పాల్గొనడం జరిగినది. ఇట్టి డే కేర్ సెంటర్ ని దివ్యాంగులు వయోవృద్ధులు మరియు ట్రాంజెండర్ వ్యక్తుల సాధికారత శాఖ ములుగు జిల్లా వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ యొక్క డే కేర్ సెంటర్ వయోవృద్ధుల ఉల్లాసం కొరకు మరియు క్రీడా కార్యక్రమాల కొరకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రభుత్వ సెలవులు మినహా అన్నివేళలా అందుబాటులో ఉంటుంది. ఈ కార్యక్రమం నందు దివ్యంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఇన్చార్జ్ నాగేంద్ర సీనియర్ సహాయకులు ఎఫ్ఆర్ఓ గణేష్ మరియు వయోవృద్ధులు మరియు సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

## మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్




హనుమకొండ, జనవరి 12 (తీన్మార్ న్యూస్): భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో సోమవారం రోజున స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్నిపశ్చిమ నియోజవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ అధ్యక్షతన నిర్వహించగా దాస్యం విజయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదట స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాస్యం విజయ్ భాస్కర్ మాట్లాడుతూ యువతలో స్ఫూర్తిని నింపిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. భారత దేశ హైందవ ధర్మాన్ని, భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప తత్వవేత్త అని అన్నారు. మనిషికి వ్యక్తిత్వ వికాసాన్ని, సామాజిక బాధ్యతలను తన ఆచరణల ద్వారా బోధించిన మహనీయుడు స్వామి వివేకానంద అని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నం మధు, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు దూలం వెంకన్న, జానకీ రాములు, సల్వాజీ రవీందర్ రావు, కోటేశ్వర్ రావు, ఖలీల్, మూటిక రాజు యాదవ్, బోడ దశరథం, తక్కళ్లపల్లి వినీల్ రావు, ఇమ్మడి లోహితా రాజు, సౌరం రఘు, ఆదిత్య యాదవ్, రాజ్ కుమార్, అనిల్, ఉదయ్, అభి తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీలకు హాజరై బహుమతుల ప్రధానం



హనుమకొండ, జనవరి 12 (తీన్మార్ న్యూస్): హనుమకొండ, విశ్వభారతీ కాలనీలో కుషాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఏనుగుల రాకేష్ హాజరై విజేతలకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. చిన్న వయస్సులు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహిస్తున్న కుషాల్ కు అతని టీమ్ సభ్యులకు, ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, కాలనీ వాసులకు శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

# రెండో రోజు కొలహాలంగా నడుస్తున్న క్రీడా పోటీలు



హనుమకొండ, జనవరి 12 (తీన్మార్ న్యూస్): కాజీపేట రైల్వే స్టేడియం లో ఐదు రోజుల పాటు నిర్వహించబడుతున్న58వ జాతీయ స్థాయి సీనియర్ ఖోఖో పోటీలలో భాగంగా సోమవారం రెండో రోజు కొలహాలంగా ఖో ఖో క్రీడా కారులతో పోటీలు ఉత్సాహంగా నడుస్తున్నాయి. క్రీడాభిమానులతో కాజీపేట పండుగ వాతావరణం తలపిస్తుంది. రెండో రోజు తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ప్రెసిడెంట్ జంగా రాఘవరెడ్డి ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలు చేసారు. ఈ పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2వేల మంది క్రీడాకారులు హాజరయ్యారు.

# జేఎన్టీయూ కళాశాల మౌలిక వసతుల పరిశీలన

## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా, జనవరి 12 (తీన్మార్ న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలో ఉన్న జేఎన్టీయూ కళాశాలను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జేఎన్టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ కిషన్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వర రావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులు, ల్యాబ్‌లు, క్యాంటీన్, వంట గదులను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, క్యాంటీన్‌లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి స్టీల్ పాత్రల వినియోగాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థుల నుంచి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఐఏఎస్ అధికారిపై అసత్య ప్రచారాలు

## తీవ్రంగా ఖండించిన ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్

## సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో జయేష్ రంజన్ ఫిర్యాదు

## ఎన్‌టీవీ సహా పలు సోషల్ మీడియా ఛానళ్లపై కేసు




హైదరాబాద్, జనవరి 12 (తీన్మార్ న్యూస్): ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై అసత్య, నిరాధారమైన వార్తలను ప్రసారం కావడం తీవ్ర చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. ఇలాంటి తప్పుడు వార్తలపై తెలంగాణ ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఐఏఎస్ అసోసియేషన్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్ ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు ఎన్‌టీవీ యాజమాన్యం, పలు ఇతర సోషల్ మీడియా ఛానళ్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జనవరి 8న ఎన్‌టీవీలో ప్రసారమైన ఒక వార్తా కథనంలో, ఒక మహిళా ఐఏఎస్ అధికారికి రాజకీయ నాయకులతో సంబంధం ఉందని, ఆమెకు వచ్చిన పోస్టింగ్‌లు (పదోన్నతులు) ఈ ప్రభావంతోనే వచ్చాయని పరోక్షంగా ఆరోపించారు. ఈ కథనంలో ఆమె పేరు ప్రస్తావించనప్పటికీ, ఆమె గతంలో నల్గొండ కలెక్టర్‌గా, ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేశారని పేర్కొంటూ ఆమె గుర్తింపును పరోక్షంగా వెల్లడించారని, ఇది ఆమె వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమే కాకుండా, ఆమె నైతికతను దెబ్బతీసేలా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వార్తలో అసభ్యకరమైన వ్యాఖ్యలు, ద్వంద్వ అర్థాలు ఉన్నాయని ఐఏఎస్ అసోసియేషన్ ఆరోపించింది.

ఈ వార్తను సోషల్ మీడియాలో వైరల్ చేసినందుకు గాను ఈ కింది ఛానళ్లపై కూడా కేసు నమోదు చేశారు

- ఎన్‌టీవీ యాజమాన్యం, ఎడిటర్లు, రిపోర్టర్లు
- తెలుగు స్క్రైబ్ ❖ ఎంఆర్ మీడియా తెలంగాణ
- ప్రైమ్9 తెలంగాణ ❖ పీవీ న్యూస్
- సిగ్నల్ టీవీ తెలుగు ❖ వోల్గా టైమ్స్
- మిర్రర్ టీవీ అఫీషియల్ ❖ టీ న్యూస్ తెలుగు

### చట్టపరమైన చర్యలు:

జయేష్ రంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు **75, 78, 79** (వేధింపులు, మహిళల గౌరవానికి భంగం కలిగించడం), **351(1), 352(2)** (శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా అవమానించడం) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా ఈ వార్తలపై ఇప్పటికే స్పందించిన మంత్రులు, అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో విప్లవాత్మక మార్పులు

## కార్పొరేట్ స్థాయిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

## ఇంటిగ్రేటెడ్ కార్యాలయానికి మంత్రి పొంగులేటి శంకుస్థాపన



మేడ్చల్, జనవరి 12 (తీన్మార్ న్యూస్): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను పూర్తిగా పారదర్శకంగా అవినీతి రహితంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కీలక సంస్కరణలు అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజలకు సౌకర్యం, పరిపాలనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యాధునిక సౌకర్యాలతో, కార్పొరేట్ స్థాయి ప్రమాణాలతో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా నిర్మిస్తున్నామన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్ పల్లి మండలంలో ఎస్.ఎస్.ఆర్ బిల్డర్స్ నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సోమవారం మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో, రెండో విడతలో జిల్లా కేంద్రాల్లో, మూడో విడతలో నియోజకవర్గ కేంద్రాలలో సమీకృత భవనాలు నిర్మిస్తామన్నారు.

### నాలుగు జిల్లాలు.. 112 క్లస్టర్లు:

ఫస్ట్ ఫేజ్ కింద ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి నాలుగు జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) భవనంలో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశామని, వచ్చే జూన్ 2 నాటికి ఈ భవనాన్ని ప్రారంభించుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకుండా బిల్డర్స్ తోనే ఈ 12 సమీకృత భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. అంతేగాక సమీకృత భవనాలను నిర్మించే సంస్థలే ఐదేళ్లపాటు వాటిని నిర్వహించాలన్న నిబంధన కూడా పొందుపరిచామన్నారు. ఈ భవనాల్లో మహిళలు, పిల్లల తల్లుల, పేదలకు సకల సౌకర్యాలు ఉంటాయని చెప్పారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖను ఆదాయ వనరుగా కాకుండా సేవా కేంద్రంగా చూస్తోందని స్పష్టం చేశారు.

### అసైండ్ భూములకు పరిహారం:

గత రెండేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా కేవలం రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు డబ్బు చేకూర్చాలనే ఆలోచన కాకుండా పేదవారిని దృష్టిలో పెట్టుకొని వివిధ సంస్కరణలు తెచ్చామని మంత్రి తెలిపారు. పేదలకు గతంలో ఇచ్చిన భూములతోపాటు ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని, ఈవిషయంలో ఉక్కుపాదంతో అక్రమాలను అణచివేస్తామని వెల్లడించారు. ప్రతిపక్షాలతో విమర్శించు కునే పరిస్థితి రాకుండా పేదల పక్షాన ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఒకప్పుడు పేదలకు పంపిణీ చేసిన భూములను, అసైన్డ్ భూములను ఒక వేళ ప్రభుత్వం తీసుకోవాలనుకున్నా వారికి తగిన పరిహారం, ప్రత్యామ్నాయ స్థలం మంజూరు వంటి చర్యలు తప్పనిసరిగా ఉంటాయన్నారు.

# జైలు అడ్మిషన్లలో 11.8 శాతం వృద్ధి

## తెలంగాణ జైళ్ల శాఖ 2025 వార్షిక నివేదిక విడుదల

## సైబర్ నేరాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో భారీ పెరుగుదల




హైదరాబాద్, జనవరి 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ జైళ్ల శాఖ- 2025 సంవత్సరానికి సంబంధించిన వార్షిక గణాంకాలను విడుదల చేసింది. గత ఏడాదితో పోలిస్తే జైలు అడ్మిషన్లలో 11.8 శాతం వృద్ధి నమోదైందని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్ర వెల్లడించారు. సోమవారం చంచల్‌గూడలో ప్రిసెన్స్ అకాడమీలో ఆమె తెలంగాణ జైళ్ల శాఖ వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సౌమ్యా మిశ్రా మాట్లాడుతూ ముఖ్యంగా సైబర్ నేరాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో భారీ పెరుగుదల కనిపించిందని పేర్కొన్నారు. 2024లో 34,811 మంది ఖైదీలు ఉండగా 2025 నాటికి 36,627 మంది ఖైదీలు పెరిగారని తెలిపారు. ఇక సివిల్ కేసుల్లో 20 మంది ఖైదీలుగా జైళ్లకు వచ్చాయని వెల్లడించారు. ఇక సైబర్ నేరాలు అత్యధికంగా 135.6 శాతం పెరిగాయని పేర్కొన్నారు. అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 152 శాతం పెరుగుదల కనిపించిందని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే జైళ్లలో విదేశీయుల అడ్మీషన్ల సంఖ్య గణనీయంగా తగ్గిందని స్పష్టం చేశారు. జైలుకు వస్తున్న వారిలో 18 నుంచి 30 ఏళ్ల లోపు యువత సంఖ్య 19,413గా ఉందన్నారు.

### జైళ్లలో సాంకేతికత, మౌలిక సదుపాయాలు

జైళ్ల శాఖలో పారదర్శకతను పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ. 2.5 కోట్లతో ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పంపిణీ చేసిందని సౌమ్య మిశ్ర తెలిపారు. కోర్టు ప్రొడక్షన్లలో 69.47 శాతం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారానే నిర్వహించినట్లుగా పేర్కొన్నారు. సిద్దిపేటలో 415 మంది సామర్థ్యంతో అత్యాధునిక 'స్వస్తిక' సెల్స్ కలిగిన జిల్లా జైలు ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. సందర్శకుల కోసం 'స్వాగతం' పోర్టల్, ఖైదీల కోసం 52 కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

### అక్షరాస్యులుగా 23,220 మంది ఖైదీలు

2025లో 79 శాతం మంది కాన్విక్ట్ ఖైదీలకు వివిధ వృత్తుల్లో శిక్షణ ఇచ్చామని సౌమ్య మిశ్రా వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా ఎక్కడా లేని విధంగా ఖైదీలకు వడ్డీ లేని రుణాలను తెలంగాణ ప్రభుత్వం అందిస్తోందని ఈ ఏడాది 58 మందికి రూ.18.66 లక్షల రుణాలు మంజూరు చేశామన్నారు. ప్రతిష్టాత్మకంగా 'థంబ్ ఇన్ - సైన్ అవుట్' కార్యక్రమం ద్వారా 23,220 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దామని గుర్తు చేశారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా దేశంలోనే మొదటిసారిగా జైళ్లలో డీ-అడిక్షన్ సెంటర్లను ప్రారంభించామని పేర్కొన్నారు. ఇక ఆరు జైళ్లలో పర్యావరణ హితంగా తేనెటీగల పెంపకాన్ని చేపట్టి 489 కిలోల తేనెను సేకరించామని తెలిపారు. పాత వార్తాపత్రికలు, ప్లాస్టిక్, ఇనుప తుక్కును ఉపయోగకరమైన వస్తువులుగా మార్చే కార్యక్రమం విజయవంతంగా సాగుతోందన్నారు. ఖైదీల పునరావాసం, పునరేకీకరణలో చేసిన కృషికి తెలంగాణ జైళ్ల శాఖకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించిందని వెల్లడించారు. చేర్యాలపల్లి సెంట్రల్ జైలు దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన జైలుగా ఎంపికై గోల్డ్ మెడల్ సాధించిందని అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 7వ ఆలిండియా ప్రిజన్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుందని సౌమ్య మిశ్రా తెలిపారు.

# దివ్యాంగుల సంక్షేమానికి అండగా ప్రభుత్వం

## రూ. 50 కోట్లతో సహాయ ఉపకరణాల పంపిణీ

## ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జనవరి 12 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం అందిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దివ్యాంగులను ఈ ప్రభుత్వం సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తోందని అందుకే దివ్యాంగులు సమాజంలో ఆత్మగౌరవంతో నిలబడేలా మా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రూ. 50 కోట్లతో వారికి సహాయ ఉపకరణాలు పంపిణీ చేస్తున్నామన్నారు. సోమవారం ప్రజాభవన్‌లో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ, ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్లు, బాల భరోసా పథకాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి దివ్యాంగులను దివ్యాంగులు వివాహం చేసుకుంటే రూ.2 లక్ష ఆర్థిక సాయం అందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. దివ్యాంగులను ఇతరులు పెళ్లి చేసుకున్నా ఆర్థిక సయం అందిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు సముచిత స్థానం ఇస్తామన్నారు. విద్యా, ఉద్యోగాలు, క్రీడల్లో రాణించిన దివ్యాంగులు ఏమాత్రం రాణించిన వారిని ప్రోత్సహించేలా మా ప్రభుత్వం పని చేస్తోందని దివ్యాంగులు ఏ మాత్రం ఆత్మస్థైర్యం కోల్పోవద్దన్నారు. క్రీడల్లో దివ్యాంగులను ప్రోత్సహించాలని పారాలింపిక్స్ లో విజయం సాధించిన అమ్మాయికి ఉద్యోగం ఇచ్చామన్నారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను ఉపయోగించుకుని దివ్యాంగులు ఎదగాలన్నారు. ఈ ప్రాంతంలో దివ్యాంగులకు సూదిని జైపాల్ రెడ్డి స్ఫూర్తి అన్నారు.

వైకల్యం ఉందనే ఆలోచనలను కూడా జైపాల్ రెడ్డి రానివ్వకుండా ఉత్తమ పార్లమెంటేరియన్ గా ఎదిగారన్నారు.

# కొత్త జిల్లాలను రద్దు చేస్తే అగ్గి రాజేస్తాం

## కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై కేటీఆర్ నిప్పులు




తెలంగాణ బ్యూరో, జనవరి 12 (తీన్మార్ న్యూస్): మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో బీఆర్ఎస్ తరపున గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు కేటీఆర్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 'గతంలో నేను మున్సిపల్ మంత్రిగా పనిచేశాను. 2014 కంటే ముందు మహబూబ్ నగర్ పట్టణం ఎట్లుండే ఇయ్యాల ఎట్లున్నది అనేది చూస్తున్న మీ అందరికీ తెలుసు. ఒక్క మహబూబ్‌నగరే కాదు, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్ ఇలా ఈ జిల్లాలో ఏ పట్టణం చూసినా ఎట్ల అభివృద్ధి చెందినయో మీరందరూ చూశారు. ఈ పట్టణాలు 2014కు ముందు ఎట్లుండే, ఇప్పుడు ఎట్లున్నయో మీరు గమనించండి. కేసీఆర్ నాయకత్వంలో ఒకట్రెండు కాదు, అన్ని పట్టణాలను అభివృద్ధి చేసుకున్నం. అన్ని పల్లెలను అభివృద్ధి చేసుకున్నాం' అని అన్నారు.

### కేసీఆర్ చేసి చూపించారు

'పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి కార్యక్రమాల కింద పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా బ్రహ్మాండంగా అభివృద్ధి చేశాం. అసెంబ్లీ ఎన్నికల్లో మనం కొద్ది తేడాతో ఓడిపోయాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయ్యింది. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఒక్క పని కూడా కొత్తగా చేసింది లేదు. పల్లెల్లో కేసీఆర్ నాయకత్వంలో ట్రాక్టర్‌లు పెట్టి, నీటి ట్యాంకర్‌లు పెట్టి, చెట్లు పెట్టి, ఇంటింటికి నల్లా పెట్టి, ప్రతి పల్లె వీధుల్లో స్ట్రీట్ లైట్‌లు పెట్టి, డంపింగ్ యార్డులు పెట్టి, వైకుంఠధామాలు కట్టి, పల్లె ప్రకృతి వనాలు కట్టి బ్రహ్మాండమైన అభివృద్ధిని కేసీఆర్ చూపించారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో ట్యాంకర్లలో నీళ్లు లేవు, ట్రాక్టర్‌లో డీజిల్ లేదు. వీధుల్లో లైట్లు వెలుగుతలేవ్' అని విమర్శించారు.

### జిల్లాలను రద్దు చేస్తామంటే అగ్గి రాజేస్తాం

ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తమ హయాంలో ఏర్పాటుచేసిన కొత్త జిల్లాలను రద్దు చేస్తామంటే అగ్గిరాజేస్తామని కేటీఆర్ హెచ్చరించారు. ప్రజలకు ప్రభుత్వ పాలన అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కొత్త జిల్లాలు, కొత్త మండలాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇబ్బందులు లేనివిధంగా ఏర్పాటుచేసిన జిల్లాలను రద్దు చేయడం కానీ, కుదిరించడం కానీ చేస్తే ఊరుకునేది లేదన్నారు. రేవంత్ రెడ్డి అడ్డిమార్ గుడ్డిలో సీఎం అయ్యారని విమర్శించారు. ఈ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి ఇచ్చిన 420 హామీల్లో ఏ మాత్రం అమలు చేశారన్నది అందరికీ తెలిసిందేనని అన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టి 90 శాతం పనులు పూర్తి చేశామని, మిగతా పది శాతం పనులను పూర్తి చేయకుండా ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పనులు పూర్తి చేస్తే తన పాత బాసు చంద్రబాబుకు కోపం వస్తుందని, మాజీ సీఎం కేసీఆర్‌కు పేరు వస్తుంది అన్న ఉద్దేశంతోనే ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేయడం లేదని ధ్వజమెత్తారు.

# పోలవరం - నల్లమల ప్రాజెక్టుపై "సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు"

మొదటి పేజీ తరువాయి

కారణాల దృష్ట్యా ఉపసంహరించుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆర్టికల్ 131 కింద 'సివిల్ సూట్ల వేయాలని కోర్టు సూచన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ కేసుపై సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

### రిట్ పిటిషన్ సరికాదు:

రాష్ట్రాల మధ్య తలెత్తే జల వివాదాలను ఆర్టికల్ 32 కింద రిట్ పిటిషన్‌గా కాకుండా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 ప్రకారం 'సివిల్ సూట్ల (అసలు దావా) ద్వారానే పరిష్కరించుకోవడం సరైన మార్గమని కోర్టు స్పష్టం చేసింది.

అన్ని రాష్ట్రాల భాగస్వామ్యం: ఈ వివాదంలో కేవలం రెండు రాష్ట్రాలే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక వంటి ఇతర బేసిన్ రాష్ట్రాల ప్రయోజనాలు కూడా ముడిపడి ఉన్నాయని, సివిల్ సూట్ అయితేనే అందరి వాదనలు సమగ్రంగా వినే అవకాశం ఉంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది.

మధ్యవర్తిత్వానికి అవకాశం: వీలైతే రాష్ట్రాలు చర్చలు లేదా మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని కూడా కోర్టు సూచించింది.

కోర్టు సూచనల మేరకు, తెలంగాణ ప్రభుత్వం తన రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకోగా, ధర్మాసనం ఆ పిటిషన్‌ను డిస్పోజ్ చేసింది.

### తెలంగాణ హక్కుల కోసం ఎందాకైనా పోరాడతాం.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సుప్రీం కోర్టు విచారణ అనంతరం తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలోని మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు.



### ప్రధాన అంశాలు:

"ఏపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా పోలవరం ఒరిజినల్ డిజైన్‌కు మార్పులు చేస్తూ, అదనపు నీటిని తరలించేందుకు ప్రయత్నిస్తోంది. దీనిని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం."

### నిబంధనల ఉల్లంఘన:

ఏపీ ప్రభుత్వం గోదావరి, కృష్ణా రివర్ బోర్డులు మరియు అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండానే ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్తోందని ఆయన ఆరోపించారు. అదనపు తరలింపు: ఏపీకి కేటాయించిన 484.5 టీఎంసీల కంటే ఎక్కువ నీటిని తరలించేలా ఈ లింక్ ప్రాజెక్టును డిజైన్ చేశారని, ఇది బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు విరుద్ధమని తెలిపారు. తదుపరి కార్యాచరణ: కోర్టు సూచించిన విధంగా రాబోయే రెండు రోజుల్లో సివిల్ సూట్ దాఖలు చేస్తామని ఉత్తమ్ వెల్లడించారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడటం కోసం న్యాయపరంగా ఎంతవరకైనా వెళ్తామని ఆయన స్పష్టం చేశారు. కాగా.. ఏపీ ప్రభుత్వం మాత్రం తాము కేవలం సముద్రంలోకి వృథగా పోయే వరద జలాలను మాత్రమే వినియోగించుకోవాలని భావిస్తున్నామని, రాయలసీమ ప్రాంత దాహార్తిని తీర్చేందుకే ఈ ప్రాజెక్టు అని వాదిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేయ-బోయే సివిల్ సూట్ ఆధారంగా సుప్రీం కోర్టు ఈ కేసులో ఇతర రాష్ట్రాలకు కూడా నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది.

# ఆర్థరైటిస్ లేదా కీళ్ల నొప్పులు తగ్గేందుకు ఈ సీజన్‌లో ఈ ఆహారాలను తీసుకోవాలి

చలికాలంలో తీవ్రతరం అయ్యే అనారోగ్య సమస్యల్లో ఆర్థరైటిస్ కూడా ఒకటి. చల్లని ఉష్ణోగ్రతలు నొప్పిని, సున్నితత్వాన్ని పెంచుతాయి రక్తప్రవాహాన్ని తగ్గిస్తాయి. దీంతో కండరాలు, కీళ్లు బిగుతుగా అనిపిస్తాయి. చలికి శరీరం ప్రతిస్పందించి ఎక్కువ తాపజనక అణువులను ఉత్పత్తి చేస్తుంది. ఇది కీళ్ల అసౌకర్యాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది. రోజువారి పనులు చేసుకోవడంలో కూడా తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. అలాగే ఉష్ణోగ్రత, తేమ, వాతావరణ పీడనం, అవపాతం, గాలివేగం వంటి వాతావరణ పరిస్థితులు కూడా కీళ్ల నొప్పులను ప్రభావితం చేస్తాయి. నొప్పిని, లక్షణాలను తగ్గించడానికి మందులు వాడినప్పటికీ వాపులను తగ్గించడానికి మాత్రం సరైన ఆహారాలను తీసుకోవడం చాలా ముఖ్యం. రోజువారి ఆహారంలో భాగంగా ఆలివ్ నూనెను తీసుకోవడం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు కలిగిన ఆహారాలను తీసుకోవడం, పండ్లు, కూరగాయలను తీసుకోవడం చేయాలి. ఇవి నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి.

### ఆలివ్ నూనె..

నీటిని ఎక్కువగా తాగడం, బరువును అదుపులో ఉంచుకోవడం వల్ల చలికాలంలో కీళ్ల సమస్య మరింత పెరగకుండా ఉంటుంది. శోథ నిరోధక లక్షణాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల కీళ్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ముఖ్యంగా ఆహారంలో భాగంగా ఆలివ్ నూనెను వాడడం వల్ల చలికాలంలో కీళ్ల నొప్పులు, వాపు తగ్గుతాయి. ఆలివ్ నూనెను తీసుకోవడం వల్ల శరీరం ప్రతిస్పందనలు తగ్గి కీళ్ల అసౌకర్యం తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు. ఆలివ్ నూనెలో ఒలియోకాంతల్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది శోథ నిరోధక మందుల లాగా ఎంజైమ్ మార్గాలపై పని చేస్తుంది. అలాగే దీనిలో శోథ నిరోధక లక్షణాలతో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉంటాయి. రోజూ రెండు నుండి మూడు టేబుల్ స్పూన్ల ఆలివ్ నూనెను తీసుకోవడం వల్ల కీళ్ల వాపు, నొప్పు వంటి సమస్యలు తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు.

### ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు..

ఆలివ్ నూనెతో పాటు యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాలు కలిగిన ఇతర ఆహరాలను తీసుకోవడం వల్ల చలికాలంలో ఆర్థరైటిస్ సమస్య మరీ ఎక్కువ కాకుండా ఉంటుందని కూడా వారు తెలియజేస్తున్నారు. ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు కలిగిన ఆహారాలను తీసుకోవడం వల్ల కీళ్లల్లో మంట తగ్గుతుంది. ఆర్థరైటిస్ వల్ల కలిగే నొప్పులు తగ్గుతాయి. అలాగే అల్లం తేలికపాటి శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉండడంతో పాటు బయోయాక్టివ్ సమ్మేళనాలను కూడా కలిగి ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల కీళ్లల్లో కలిగే అసౌకర్యం తగ్గుతుంది. పసుపులో కర్కుమిన్ అనే క్రియాశీల సమ్మేళనం ఉంటుంది. ఇది వాపులతో పోరాడడంలో మనకు సహాయపడుతుంది. వంటల్లో వాడడంతో పాటు పాలల్లో కలిపి పసుపును తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

### వాల్ నట్స్, అవిసె గింజలు..

వాల్‌నట్స్, చియాగింజలు, అవిసె గింజలు కూడా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లను అందిస్తాయి. అల్పాహారంలో, సలాడ్లలో లేదా స్నాక్స్ గా వీటిని తీసుకోవడం వల్ల కీళ్ల ఆరోగ్యంతో పాటు శరీర మొత్తం ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే బెర్రీలు, ఆకుకూరలు, బెల్ పెప్పర్ లలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ కారణం గా కీళ్ల కణజాలం దెబ్బతినకుండా కాపాడడంలో సహాయపడతాయి.

# మున్సిపల్ కార్పొరేషన్లలో "ట్రాన్స్‌జెండర్లకు ప్రాతినిధ్యం"



హైదరాబాద్, జనవరి 12 (తీన్మార్ న్యూస్): ట్రాన్స్ జెండర్ల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీపి కబురు చెప్పారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కో ఆప్షన్ మెంబర్ గా ఒక ట్రాన్స్ జెండర్ ని కార్పొరేటర్ గా నామినేట్ చేయాలని సూచించారు. తద్వారా వారి సమస్యలపై వారు మాట్లాడుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. దీనికి సంబంధించి వచ్చే కేబినెట్ సమావేశంలో ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. వీరికి అవకాశం ఇవ్వడం ద్వారా వారి సమస్యలను మనం ప్రస్తావించడం కాకుండా వారి సమస్యలను వారే ప్రస్తావిస్తారని అలాగే ఈ సమాజంలో వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సోమవారం 'బాల భరోసా', 'ప్రణామ్' డే కేర్ సెంటర్లను ప్రజాభవన్ లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలక విషయాలు ప్రస్తావించారు. ట్రాన్స్ జెండర్స్ కు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు.

### తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జీతంలో కోత:

ప్రభుత్వ ఉద్యోగుల తల్లితండ్రులను నిర్లక్ష్యం చేసే ఉద్యోగుల జీతంలో 10-15 శాతం కోత విధిస్తామన్నారు. కోత విధించిన డబ్బును తల్లిదండ్రుల ఖాతాల్లో వేస్తామన్నారు. ఈ విషయంలో ఈ బడ్జెట్ సమావేశాల్లోనే చట్టం చేస్తామన్నారు. తహశీల్దార్లు, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేస్తే వారి జీతాల్లో కోత విధిస్తామన్నారు. తల్లిందండ్రులను నిర్లక్ష్యం చేసే వారిని మనమే దారిలోకి తీసుకురావాల్సిన అవసరం ఈప్రభుత్వానికి ఉందన్నారు. తల్లిదండ్రులపై బాధ్యత లేనివారికి సమాజంపై ఏం బాధ్యత ఉంటుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిఒక్కరికీ వైద్యం అందించాలనే ప్రణాళికలను ఈ ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు.

### రెండేళ్లలోనే అద్భుతాలు చేశామనిచెప్పడంలేదు:

తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం కోరుకుంటోందని అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్నదే మా ఉద్దేశం అని వర్గీకరణ కారణంగా కొందరిలో అసంతృప్తి ఉన్నా త్వరలో సర్దుకుంటాయన్నారు. వందేళ్ల తర్వాత తొలిసారి జనగణనతో పాటు కులగణన చేశామన్నారు. జనాభా దమాషా ప్రకారం అవకాశాలు కల్పించాలని చూస్తోందన్నారు. ఈ ఏడాదిలో కేంద్రం చేస్తున్న జనగణన తెలంగాణ జనగణన మోడల్ ను కాపీ కొట్టిందన్నారు. దేశానికి తెలంగాణ రోల్ మోడల్ గా నిలిచిందన్నారు. రెండేళ్ల మా పాలనలో అన్ని సమస్యలు పరిష్కరించామని, అద్భుతాలు చేశామని నేను చెప్పడం లేదు. కానీ ఉన్న సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోందన్నారు. ఒకప్పుడు ఈ ప్రజాభవన్ లోకి అడుగు పెట్టేందుకు నాలుగు గంటలు ఎదురు చూసినా గద్దర్ రాలేకపోయారు. కొద్ది మంది శ్రీమంతులు, బడా వ్యక్తులకే ఎంట్రీ ఉండేది. కానీ ఇప్పుడు సామాన్యులు కూడా ఇక్కడకు రావొచ్చు. ధర్మగంట కొట్టవచ్చు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం కోరుకుంటోందన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్నదే మా ఉద్దేశం అన్నారు. ప్రజా సమస్యలను. ఇంకా చేయాల్సింది చాలా ఉందని ఈ ప్రజాప్రభుత్వానికి అండగా ఉండాలని తెలంగాణను దేశంలోనే అభివృద్ధి చేస్తామన్నారు.

# రేవంత్ సర్కార్‌కు నీటి సోయి లేదు

## పోలవరం - నల్లమల ప్రాజెక్టుపై కవిత ఘాటు విమర్శలు



హైదరాబాద్, జనవరి 12 (తీన్మార్ న్యూస్): రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదం నడుస్తున్న నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయితే తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌కు అర్హత లేదని ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ అంశంపై సోమవారం కవిత తెలంగాణ జాగృతి ఎక్స్ ఖాతా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు.

### తెలంగాణ పెను నష్టం వాటిల్లే ప్రమాదం

కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాపాడలేదని మ-రోసారి స్పష్టం అయిందని విమర్శించారు. నీటి పంపకాల విషయంలో పొరుగు రాష్ట్రాలతో పేచీలు పెట్టుకోవడం ఇష్టం లేదన్న ఈ ముఖ్యమంత్రి చేతగాని మాటలు న్యాయ పోరాటంలోనూ ప్రతిఫలించడం తెలంగాణ రాష్ట్రం చేసుకున్న దురదృష్టం అని తెలిపారు. ఏపీ ప్రభుత్వం కేంద్ర సర్కారు అండతో అక్రమంగా నిర్మిస్తున్న పోలవరం - నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు పై విచారణ అర్హత లేని పిటిషన్ వేసి రాష్ట్రం హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాసిందన్నారు. నీటి సోయి లేని ముఖ్యమంత్రి, ప్రభుత్వంలోని ఇతర ముఖ్యుల వల్ల తెలంగాణ నీటి హక్కులను పెను నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నదని ఆరోపించారు. ఏపీ ప్రభుత్వ అక్రమ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా తెలంగాణ జాగృతి న్యాయ పోరాటం చేస్తుందని, తెలంగాణ హక్కుల పరిరక్షణ ధ్యేయంగా ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు.

# ఫిబ్రవరి 1న లోక్‌సభలో కేంద్ర బడ్జెట్

న్యూ ఢిల్లీ, జనవరి 12 (తీన్మార్ న్యూస్): 2026-27 కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశపెడతారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 28న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. ఫిబ్రవరి 1న దిగువ సభలో ఉదయం 11:00 గంటలకు బడ్జెట్ సమర్పణ ప్రక్రియ ప్రారంభమవుతుందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయంపై ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. అంతకుముందు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ జనవరి 28న ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల మొదటి దశ ఫిబ్రవరి 13న ముగుస్తుందని అన్నారు. మార్చి 9న రెండవ దశ కోసం పార్లమెంటు తిరిగి సమావేశమై ఏప్రిల్ 2 వరకు కొనసాగుతుంది. అర్థవంతమైన చర్చ మరియు ప్రజా-కేంద్రీకృత పాలన వైపు ఇది ఒక కీలకమైన అడుగు అని శ్రీ రిజిజు అన్నారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు, 2026 బడ్జెట్ సమావేశానికి పార్లమెంటు ఉభయ సభలను పిలవడానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని మంత్రి తెలియజేశారు.



## సోఫీ షైన్‌తో శిఖర్ ధావన్ నిశ్చితార్థం!

భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ తన స్నేహితురాలు సోఫీ షైన్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. చాలా కాలంగా ఇద్దరూ ఒకరినొకరు డేట్ చేస్తున్నారు. మొదట్లో సీక్రెట్‌గా జరిగిన వ్యవహారాన్ని సోషల్ మీడియా ద్వారా అప్పుడప్పుడు వెల్లడిస్తూ వచ్చాడు. ఇప్పుడు ఏకంగా వారి నిశ్చితార్థం విషయాన్ని కూడా చెప్పేశారు. తన నిశ్చితార్థం ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ అభిమానులకు ఈ శుభవార్తను అందించాడు. సోఫీ కంటే ధావన్ 5 సంవత్సరాలు పెద్దవాడు. శిఖర్ ధావన్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఫోటోను షేర్ చేశాడు, ఇందులో శిఖర్, సోఫీ చేతిలో నిశ్చితార్థపు ఉంగరం ఉంది. శీర్షికలో, ధావన్ ఇలా రాశాడు, "నవ్వులు పంచుకోవడం నుంచి కలలను పంచుకోవడం వరకు, మా నిశ్చితార్థం కోసం వచ్చిన ప్రేమ, ఆశీర్వాదాలు, ప్రతి శుభాకాంక్షలకు నేను కృతజ్ఞుడను, ఎందుకంటే మేము కలిసి జీవించాలని నిర్ణయించుకున్నాము." అని రాసుకొచ్చాడు.సోఫీ ఐర్లాండ్‌కు చెందిన యువతి. ఆమె ఒక ప్రోడక్ట్ కన్సల్టెంట్. ప్రస్తుతం ఆమె అబుదాబిలోని ఒక కంపెనీలో సెకండ్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమె 1990లో జన్మించింది, ప్రస్తుతం ఆమె వయస్సు 36 సంవత్సరాలు. లిమెరిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి మార్కెటింగ్, మేనేజ్‌మెంట్‌లో చదువు పూర్తి చేసింది. 2023లో శిఖర్ ధావన్‌కు చాలా ఇబ్బందికరమైన సమస్యలు వచ్చాయి. బ్యాడ్ టైం నడిచింది. మొదటి భార్య ఆయేషా ముఖర్జీ వివాదాలు సాగాయి. కలిసి జీవించలేమని గ్రహించి ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. కుమారుడికి దూరం కావడంతో శిఖర్ ధావన్ చాలా భావోద్వేగానికి లోనయ్యాడు. వాటిని ఏమాత్రం తనలో దాచుకోలేదు. వాటిని ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ తన ఆలోచనలు పంచుకుంటూ పోస్టులు పెట్టాడు. కట్ చేస్తే ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో ధావన్ సోఫీ షైన్‌తో కనిపించి అందరికీ షాక్ ఇచ్చాడు. ఈ టోర్నమెంట్‌కు పాకిస్తాన్ ఆతిథ్యం ఇచ్చింది. కానీ భారత్ ఆ దేశం వెళ్లలేదు. తన మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడింది. దుబాయ్‌లోని ఒక రెస్టారెంట్‌లో సోఫీ షైన్‌ను మొదటిసారి కలిసినట్లు ధావన్ చెప్పారు. ఆ రోజున కామోఫ్లాజ్ ట్రౌజర్స్, జాకెట్‌లో సోఫీ చాలా అందంగా కనిపించిందని క్రికెటర్ చెప్పాడు. మొదటి సమావేశం గురించి మాట్లాడుతూ, ధావన్ అందమైన ముఖం, అల్లరి కళ్ళతో ఆకర్షితుడైనట్లు సోఫీ చెప్పారు.నిశ్చితార్థం చేసుకున్న శిఖర్ ధావన్ సోఫీ షైన్ కలిసి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలు కూడా చేస్తున్నారు. ధావన్ అతనితో చాలా ఫన్నీ వీడియోలను షేర్ చేశాడు. వార్తల ప్రకారం, వచ్చే నెలలో శిఖర్ , సోఫీ వివాహం జరగనుంది.

## రిజ్వాన్‌కు భారీ అవమానం..

ఆస్ట్రేలియా వేదికగా జరుగుతున్న బిగ్ బాష్ లీగ్‌లో సోమవారం సిడ్నీ థండర్ వర్సెస్ మెల్బోర్న్ రెనెగేడ్స్ మధ్య జరిగిన మ్యాచ్ ఒక చారిత్రాత్మక నిర్ణయానికి వేదికైంది. మెల్బోర్న్ రెనెగేడ్స్ తరపున ఆడుతున్న పాకిస్థాన్ స్టార్ మొహమ్మద్ రిజ్వాన్‌ను, అతని నెమ్మదైన బ్యాటింగ్ కారణంగా కెప్టెన్ విల్ సదర్లాండ్ ఇన్నింగ్స్ మధ్యలోనే వెనక్కి పిలిపించారు. దీంతో బీబీఎల్ చరిత్రలో 'రిటైర్డ్ అవుట్ట అయిన తొలి విదేశీ ఆటగాడిగా రిజ్వాన్ నిలిచాడు.సిడ్నీ థండర్‌తో జరిగిన ఈ పోరులో మెల్బోర్న్ రెనెగేడ్స్ మొదట బ్యాటింగ్ చేపట్టింది. నాలుగో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన మొహమ్మద్ రిజ్వాన్ క్రీజులో పాతుకుపోయినప్పటికీ, ఆశించిన స్థాయిలో పరుగులు రాబట్టలేకపోయాడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో భారీ షాట్లు ఆడాల్సిన సమయంలో రిజ్వాన్ సింగిల్స్‌కే పరిమితమయ్యాడు. ఆయన 23 బంతుల్లో కేవలం 26 పరుగులు (2 ఫోర్లు, 1 సిక్సర్) మాత్రమే చేశాడు. ఆయన స్ట్రైక్ రేట్ 113 దగ్గరే ఆగిపోవడంతో, స్కోరు బోర్డు వేగం తగ్గింది.ఇన్నింగ్స్ 18 ఓవర్లు ముగిసే సమయానికి మెల్బోర్న్ జట్టు 154/5 స్కోరుతో ఉంది. ఇన్నింగ్స్ ముగియడానికి ఇంకా 12 బంతులు మాత్రమే మిగిలి ఉండటంతో, భారీ హిట్టర్లు అవసరమని కెప్టెన్ విల్ సదర్లాండ్ భావించారు. డగౌట్ నుంచి సిగ్నల్ రావడంతో, రిజ్వాన్ ఎటువంటి గాయం లేకపోయినప్పటికీ మైదానాన్ని వీడాల్సి వచ్చింది. నిబంధనల ప్రకారం దీనిని 'రిటైర్డ్ అవుట్టగా పరిగణిస్తారు.రిజ్వాన్ స్థానంలో స్వయంగా కెప్టెన్ విల్ సదర్లాండ్ క్రీజులోకి వచ్చాడు. అయితే ఈ మాస్టర్ ప్లాన్ ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. సదర్లాండ్ ఎదుర్కొన్న మొదటి బంతికే రన్ అవుట్ అయి పెవిలియన్ చేరాడు. చివరి రెండు ఓవర్లలో రెనెగేడ్స్ జట్టు కేవలం 16 పరుగులు మాత్రమే జోడించగలిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఆ జట్టు 8 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. పాక్ ఆల్ రౌండర్ హసన్ ఖాన్ (31 బంతుల్లో 46) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.ఈ సీజన్‌లో మొహమ్మద్ రిజ్వాన్ ప్రదర్శన నిరాశాజనకంగా ఉంది. ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్‌ల్లో ఆయన కేవలం 167 పరుగులు మాత్రమే చేశాడు. ఆయన ఓవరాల్ స్ట్రైక్ రేట్ 101 గా ఉండటం టీ20 ఫార్మాట్‌లో ఆందోళన కలిగించే అంశం. పాకిస్థాన్ వైట్ బాల్ కెప్టెన్ అయిన రిజ్వాన్‌ను ఇలా మధ్యలోనే వెనక్కి పిలిపించడం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. గతంలో ఐపీఎల్‌లో రవిచంద్రన్ అశ్విన్ ఇలాంటి సాహసం చేయగా, ఇప్పుడు బీబీఎల్‌లో రిజ్వాన్ రూపంలో మరో ఉదాహరణ కనిపిస్తోంది. జట్టు ప్రయోజనాల కోసం ఆటగాళ్లను రిటైర్డ్ అవుట్ చేయడం ఆధునిక క్రికెట్‌లో ఒక వ్యూహంగా మారుతోంది.

# బ్యాటింగ్ శైలిని పూర్తిగా మార్చేసుకున్న కోహ్లీ

క్రికెట్ ప్రపంచంలో విరాట్ కోహ్లీ ఒక రన్ మెషీన్. గత దశాబ్ద కాలంగా అతను క్రీజులో ఉన్నాడంటే స్కోరు బోర్డు పరుగులెడుతుందని ఫ్యాన్స్‌కు నమ్మకం. అయితే నిన్నటి వరకు మనం చూసిన కోహ్లీ వేరు, ఇప్పుడు చూస్తున్న కోహ్లీ వేరు. సాధారణంగా విరాట్ క్రీజులోకి రాగానే కొంచెం సమయం తీసుకుని, సెటిల్ అయ్యాక గేర్ మారుస్తుంటాడు. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను ఆడిన తీరు చూస్తే, కోహ్లీ తన బ్యాటింగ్ ఫిలాసఫీని పూర్తిగా మార్చేసుకున్నాడని అర్థమవుతోంది. వడోదరలో జరిగిన మ్యాచ్?లో కోహ్లీ ఫస్ట్ మూడు బంతుల్లోనే బౌండరీ బాదేశాడు. రాయ్‌పూర్, రాంచీ మ్యాచ్‌ల్లో కూడా ఇదే ట్రెండ్ కనిపిస్తోంది. బౌలర్ ఎవరైనా సరే, క్రీజులోకి రాగానే తన ఆధిపత్యాన్ని చాటుకోవాలని కోహ్లీ ప్రయత్నిస్తున్నాడు. గతంలో ఇన్నింగ్స్?ను హోల్డ్ చేసే యాంకర్ రోల్ పోషించిన విరాట్ ఇప్పుడు మాత్రం ఎదురుదాడితో బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. అనవసరంగా వెయిట్ చేయకుండా మన స్ట్రెంగ్త్ మీద నమ్మకంతో కౌంటర్ ఎటాక్ చేయాలి అని కోహ్లీ స్వయంగా తన కొత్త ఫార్ములాను బయటపెట్టాడు.విరాట్ కోహ్లీ ఇప్పుడు ఏ రికార్డు కోసమో లేక తనని తాను నిరూపించుకోవడానికో ఆడటం లేదు. అన్నీ సాధించాక వచ్చే ఒక రకమైన స్వేచ్ఛ అతని బ్యాటింగ్ లో కనిపిస్తోంది. టెస్ట్, టీ20 రిటైర్మెంట్ తర్వాత వన్డేలలో మళ్ళీ స్ట్రాంగ్ రీఎంట్రీ ఇచ్చిన కోహ్లీ, తనలోని పాత ప్యాషన్?ను వెతుక్కుంటున్నట్లు కనిపిస్తోంది. గణాంకాలు చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. అక్టోబర్ నుంచి ఆడిన ఏడు మ్యాచుల్లో విరాట్ 106 స్ట్రైక్ రేట్‌తో 469 పరుగులు చేశాడు. ఇది అతని కెరీర్ యావరేజ్ స్ట్రైక్ రేట్ (93.7) కంటే చాలా ఎక్కువ. రికార్డుల భారం దింపేసి ఆడుతుండటం వల్లే ఈ అద్భుతమైన ఫామ్ సాధ్యమవుతోంది.కోహ్లీ ప్రస్తుత బ్యాటింగ్ స్టైల్ చూస్తుంటే



కెప్టెన్ రోహిత్ శర్మ పద్ధతి గుర్తొస్తుంది. 2023 వన్డే వరల్డ్ కప్, 2024 టీ20 వరల్డ్ కప్‌లలో రోహిత్ కూడా ఇదే తరహా అగ్రెసివ్ మైండ్ సెట్‌తో ఆడి సక్సెస్ అయ్యాడు. వ్యక్తిగత రికార్డుల కంటే టీమ్‌కి మంచి ఆరంభం ఇవ్వడమే లక్ష్యంగా రోహిత్ బ్యాట్ ఝులిపించాడు. ఇప్పుడు విరాట్ కూడా అదే బాటలో నడుస్తున్నాడు. నెంబర్ 3 లో బ్యాటింగ్‌కి వచ్చే కోహ్లీ, బౌలర్లు సెటిల్ అవ్వకముందే వారి లయను దెబ్బతీస్తూ టీమ్ ఇండియాను సేఫ్ జోన్‌లో కూర్చోబెడుతున్నాడు.విరాట్‌లో వచ్చిన ఈ మార్పు కేవలం బ్యాటింగ్‌లోనే కాదు, తన ఆలోచనా విధానంలో కూడా కనిపిస్తోంది. "నేను ఇప్పుడు మైలురాళ్ల గురించి ఆలోచించడం లేదు, టీమ్‌ని కంఫర్టబుల్ పొజిషన్‌లో ఉంచడమే నా గోలు అని అతను ఓ క్లారిటీ ఇచ్చేశాడు. టెక్నిక్‌లో మార్పులు కంటే మెంటల్‌గా అతను ఎంత స్ట్రాంగ్‌గా ఉన్నాడనేది అర్థమవుతుంది. మెల్లగా ఆడుతూ వికెట్ ఇచ్చుకునే కంటే, తన బలాన్ని నమ్ముకుని అటాక్ చేయడం మంచిదని అతను భావిస్తున్నాడు. ఈ క్లారిటీయే అతన్ని క్రికెట్‌లో మళ్లీ తిరుగులేని వీరుడిగా మారుస్తోంది. వడోదర, రాయ్‌పూర్‌లలో కోహ్లీ కొట్టిన బౌండరీలు కేవలం రన్స్ మాత్రమే కాదు, ప్రత్యర్థులకు అతను ఇస్తున్న హెచ్చరికలు. తన ఆటను మార్చుకుంటూ మోడరన్ క్రికెట్ డిమాండ్స్‌కి తగ్గట్టుగా అతను అప్డేట్ అవుతున్నాడు. వయసు పెరుగుతున్నా తన ఫిట్‌నెస్, ఆకలి ఏమాత్రం తగ్గలేదని విరాట్ నిరూపిస్తున్నాడు. కెరీర్ చివరి దశలో ఉన్నా కూడా ఇంతటి ఎనర్జీతో, భయం లేకుండా ఆడటం నిజంగా గ్రేట్ అని చెప్పాలి. కింగ్ కోహ్లీ ఇదే జోరు కొనసాగిస్తే రాబోయే రోజుల్లో టీమ్ ఇండియా మరిన్ని విజయాలను అందుకోవడం ఖాయం.

## వైభవ్ సూర్యవంశీ దెబ్బకు కోహ్లీ, గిల్ రికార్డులు బద్దలు

భారత క్రికెట్‌లో మరో అద్భుతమైన ప్రతిభ వెలుగులోకి వచ్చింది. కేవలం 14 ఏళ్ల వయసులోనే తన బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దిగ్గజాల దృష్టిని ఆకర్షిస్తున్నాడు బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ. ప్రస్తుతం జరుగుతున్న యూత్ వన్డే సిరీస్‌లలో పరుగుల వరద పారిస్తున్న ఈ యువ ఆటగాడు, త్వరలో జరగనున్న యూ19 వరల్డ్ కప్ 2026లో టీమిండియా స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్ పేరిట ఉన్న భారీ రికార్డులను తుడిచిపెట్టేందుకు సిద్ధమయ్యాడు. యూత్ వన్డే కెరీర్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాళ్ల జాబితాలో వైభవ్ వేగంగా దూసుకుపోతున్నాడు. ఇప్పటివరకు ఆడిన 18 మ్యాచ్‌ల్లోనే 973 పరుగులు సాధించాడు. టీమిండియా రన్ మెషీన్ విరాట్ కోహ్లీ తన కెరీర్‌లో మొత్తం 978 పరుగులు చేశాడు. అంటే, వైభవ్ మరో 6 పరుగులు చేస్తే చాలు, కోహ్లీ రికార్డును అధిగమించి ముందుకు వెళ్తాడు. కేవలం కోహ్లీ మాత్రమే కాదు, ప్రస్తుత టీమిండియా స్టార్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ రికార్డు కూడా వైభవ్ టార్గెట్‌లో ఉంది. గిల్ తన యూ19 వన్డే కెరీర్‌లో 1149 పరుగులు చేశాడు. వైభవ్ సూర్యవంశీ ఫామ్ చూస్తుంటే, రాబోయే అండర్-19 ప్రపంచ కప్‌లోనే ఈ మార్కును సులువుగా దాటే అవకాశం కనిపిస్తోంది.కేవలం 13 ఏళ్ల వయసులోనే యూత్ వన్డేల్లో సెంచరీ చేసిన రికార్డు వైభవ్ సొంతం.?సిక్సర్ల కింగ్: యూత్ వన్డేల్లో అత్యధికంగా 80కి పైగా సిక్సర్లు బాదిన రికార్డు కూడా ఈ చిన్నారి ఆటగాడి ఖాతాలోనే ఉంది.?రాబోయే యూ19 వరల్డ్ కప్‌లో వైభవ్ సూర్యవంశీ ఏ రేంజ్‌లో చెలరేగుతాడో అని క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. తన పవర్ హిట్టింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు నిద్రలేకుండా చేస్తున్న ఈ 'వండర్ కిడ్ట భవిష్యత్తులో భారత సీనియర్ జట్టులో కూడా సంచలనం సృష్టించడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.



## మారిన బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదికలు..

2026 టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదికలు మారవచ్చు అని తెలుస్తోంది. ఈ మేరకు బీసీసీఐ ఒక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వేదిక శ్రీలంకలో ఉంటుందా లేదా భారతదేశంలోని మరొక నగరానికి మారుస్తారా అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది? 2026 టీ20 ప్రపంచ కప్‌ను ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక నిర్వహించనున్న సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం, బంగ్లాదేశ్ జట్టు అన్ని గ్రూప్ మ్యాచ్‌లు మొదట కోల్‌కతా, ముంబైలలో జరగాల్సి ఉంది. క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం, బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదికను శ్రీలంకకు మార్చే అవకాశం లేదు. బంగ్లాదేశ్ మ్యాచ్‌లను దక్షిణ భారతదేశానికి మార్చే అవకాశం ఎక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. దీని అర్థం కోల్‌కతా, ముంబైలకు బదులుగా చెన్నై, తిరువనంతపురంలో మ్యాచ్‌లు నిర్వహించవచ్చు అని తెలుస్తోంది. బంగ్లాదేశ్‌లో హిందువుల హత్యలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలకు ప్రతిస్పందనగా బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ నుంచి బీసీసీఐ బహిష్కరించింది. ఈ చర్యకు ప్రతిస్పందనగా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు 2026 టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లను మార్చాలని ఐసీసీకి ఇమెయిల్ పంపింది. బంగ్లాదేశ్ తన మ్యాచ్‌లను భారతదేశం నుంచి శ్రీలంకకు మార్చాలని కోరింది. భద్రతా సమస్యలను పేర్కొంటూ భారతదేశంలో ఆడకూడదని తన ఇమెయిల్‌లో కోరికను వ్యక్తం చేసింది. ఇటీవలి నివేదికలు బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదిక మార్పును సూచిస్తున్నాయి. అయితే, ఇది బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు డిమాండ్ వల్ల జరిగిందా లేదా అని చెప్పడం కష్టం, ఎందుకంటే ఇది బీసీసీఐ నిర్ణయం అని నివేదికలు సూచిస్తున్నాయి. 2026 టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ తన ప్రచారాన్ని ఫిబ్రవరి 7న ప్రారంభించనుంది. షెడ్యూల్ ప్రకారం, అది తన మొదటి మ్యాచ్‌ను వెస్టిండీస్‌తో కోల్‌కతాలో ఆడాల్సి ఉంది. ఆ తర్వాత, ఫిబ్రవరి 9న ఇటలీతో, ఫిబ్రవరి 14న ఇంగ్లాండ్‌తో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌లు కూడా కోల్‌కతాలోనే జరగనున్నాయి. బంగ్లాదేశ్ తన చివరి లీగ్ మ్యాచ్‌ను ఫిబ్రవరి 17న ముంబైలో నేపాల్‌తో ఆడనుంది.

## ఆయుష్ బదోనికి పిలుపు!

న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఆడుతున్న భారత్ జట్టులో మార్పులు చేర్పులు జరిగాయి. బౌలింగ్ చేస్తున్నప్పుడు గాయపడ్డ వాషింగ్టన్ సుందర్ స్థానంలో ఆయుష్ బదోనీకి పిలుపునిచ్చారు. వన్డే సిరీస్‌లో భాగంగా వడోదరలో ఆదివారం జరిగిన మొదటి వన్డే మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్నప్పుడు వాషింగ్టన్ సుందర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని స్థానంలో ఆయుష్ బదోనిని ప్రకటించింది. మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. దీంతో ఆ రెండు మ్యాచ్‌లకు వాషింగ్టన్ స్థానంలో బదోని ఆడనున్నాడు. నవరి 14, 18 తేదీల్లో భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో, మూడో వన్డే మ్యాచ్‌లు జరగనున్నాయి. , వాషింగ్టన్ సుందర్ స్థానంలో భారత జట్టులో ఇప్పుడు బదోని చేరాడు. ఆయుష్ బదోని ఎవరు, అతను మొదటిసారిగా టీమ్ ఇండియా జట్టులోకి ఎందుకు ఎంపిక చేశారు. అలాంటి ఫెర్ఫార్మెనన్స్ యన ఏం చేశాడో ఇక్కడ తెలుసుకోండి. ఆయుష్ బదోని డిసెంబర్ 3, 1999న ఢిల్లీలో జన్మించాడు, అయితే అతను వాస్తవానికి ఉత్తరాఖండ్‌కు చెందినవాడు. అతని కుటుంబం దేవప్రయాగ్ బ్లాక్‌లోని చిన్న గ్రామం సిలోడ్‌కు చెందినది. వాస్తవానికి ఉత్తరాఖండ్‌కు చెందిన అతని కుటుంబం తరువాత ఢిల్లీకి షిఫ్ట్ అయ్యింది, దీని కారణంగా ఆయుష్ తన బాల్యాన్ని ఢిల్లీలోనే గడిపాడు. ఆయుష్ బదోనికి చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే చాలా ఇష్టం. 9 సంవత్సరాల వయస్సులోనే క్రికెట్‌ను సీరియస్‌గా తీసుకొని ప్రాక్టీస్ ప్రారంభించాడు. కుమారుడి టాలెంట్ గుర్తించిన తండ్రి బదానిని సోనెట్ క్రికెట్ అకాడమీలో కోచింగ్ కోసం జాయిన్ చేశాడు. అప్పటి వరకు తండ్రి వద్దే శిక్షణ తీసుకున్నాడు. అంటే వాస్తవానికి అతని మొదటి కోచ్ అతని తండ్రి వివేక్ బదోని అయ్యారన్నమాట. వివేక్ తన కొడుకులో క్రికెట్ పట్ల ఉన్న మక్కువను చూసి బంతి, బ్యాట్‌ను ఎలా ఉపయోగించాలో నేర్పించడం ప్రారంభించాడు. వివేక్ బదోని వృత్తిరీత్యా డాక్యుమెంటరీ సినిమాలు తీస్తారు. ఆయుష్ తల్లి, విభ బదోని వృత్తిరీత్యా స్కూల్ టీచర్. బదాని ఆసక్తిని గమనించిన తండ్రి వివేక్ ఇంటి పైకప్పును నెట్ ప్రాక్టీస్ ఏరియాగా మార్చారు. ఆయుష్ ఇక్కడే నెట్ ప్రాక్టీస్ చేసేవాడు. 26 ఏళ్ల ఆయుష్ బదోని దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ తరపున ఆడాడు. ఐపీఎల్లో లక్నో సూపర్ జెయింట్స్ తరపున అరంగేట్రం చేశాడు. 2022లో లక్నో సూపర్ జెయింట్స్ బదోనిని 20 లక్షల రూపాయలకు తమ జట్టులో చేర్చుకుంది. అప్పటి నుంచి అతను ఈ జట్టు కోసం ఆడుతున్నాడు. ఐపీఎల్ 2026లో అతనికి 4 కోట్ల రూపాయల భారీ జీతం లభించనుంది.





# కథ చిన్నదే అయినా.. కథనం అద్భుతం

## ప్రేక్షకులను సరదా పట్టించిన మనశంకర వరప్రసాద్

సాధారణంగా చిరంజీవి సినిమా అంటే .ఓష్...దానికి తోడు ప్రత్యేక పాత్రలో వెంకటేశ్ తోడయ్యాడు. ఇంకేముందీ.. అంచనాలు అంబరాన్ని తాకాయి. విడుదలైన ప్రచార చిత్రాలన్నీ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. ఇక హిట్ మిషిన్ అనిల్ రావిపూడి ఈ సినిమాకు దర్శకుడు కావడంతో విజయం తథ్యం అని జనాలంతా ఫిక్సయిపోయారు. ఇంతటి పాజిటివ్ వాతావరణం మధ్య ఎట్టకేలకు సోమవారం 'మన శంకర వరప్రసాద్‌గారు' సంక్రాంతికి వచ్చేశారు. కథలోకి వెళితే... కేంద్రమంత్రి శర్మ(శరత్ సక్సేనా)కు 'నిన్ను చంపేస్తున్నాం' అంటూ ఓ హంతకుల గ్యాంగ్ నుంచి బెదిరింపు కాల్ రావడం.. ఆయన దగ్గర పనిచేస్తున్న నేషనల్ సెక్యూరిటీ ఆఫీసర్ శంకర్‌వరప్రసాద్(చిరంజీవి) ఆ గ్యాంగ్‌ని తుదముట్టించడంతో కథ మొదలవుతుంది. శంకర్‌వరప్రసాద్‌ని శర్మ తన కుటుంబ సభ్యుడిగా చూసుకుంటూ ఉంటాడు. ఎప్పుడూ సరదాగా ఉండే శంకరప్రసాద్ మనసులో ఏదో బాధ ఉన్నదని గ్రహించిన శర్మ.. ఓ రోజు శంకరప్రసాద్‌ని కారణం అడగుతాడు. భార్యతో విడిపోవడం.. కన్నబిడ్డలకు దూరం కావడం.. ఇవే శంకర వరప్రసాద్ బాధకు కారణాలని శర్మకు అర్థమవుతుంది. అందుకే ఓ బోర్డింగ్ స్కూల్‌లో చదువుకుంటున్న పిల్లల్ని కలుసుకునే ఏర్పాటు చేస్తాడు శర్మ. ఆ స్కూల్‌లో పీఈటీగా జాయిన్ అయిన శంకర వరప్రసాద్.. తన పిల్లలకు ఎలా చేరువ-య్యాడు? అసలు శంకరప్రసాద్ భార్యతో విడిపోవడానికి కారణం ఏంటి? చివరకు ఆ కుటుంబం ఎలా కలిసింది? అనే ప్రశ్నలకు సమాధానమే మిగతా కథకథగా చెప్పుకుంటే పెద్దగా కథేం కాదు. కానీ ఉన్న కథను క్యూట్‌గా.. ఎక్కడా అనవసరపు పాత్రలు కానీ, సన్నివేశాలు కానీ లేకుండా అర్థవంతంగా నడిపాడు దర్శకుడు అనిల్ రావిపూడి. సాధారణంగా ఇలాంటి కథలకు లాజిక్కులు వెతక్కూడదు. ఈ సినిమాలో కూడా కొన్ని లాజిక్ లేని విషయాలున్నా అవి ఆడియన్స్‌ని అంతగా ఇబ్బంది పెట్టవ్. అపార్థం చేసుకొని విడిపోయిన భార్యకు తానేంటో అర్థం కావాలని తపించే భర్త కథ ఇది. దూరమైన బిడ్డలను అక్కున చేర్చుకోవాలని తహతహలాగే ఓ తండ్రి కథ ఇది. ఈ కథ చుట్టూ వినోదాన్ని మేళవించి జనరంజకంగా మలిచాడు దర్శకుడు అనిల్ రావిపూడి. ప్రధాన పాత్రల మధ్య ఏర్పాడే ఆయా పరిస్థితుల నుంచి పుట్టే కామెడీనే ఈ సినిమాలో ఆద్యంతం కనిపిస్తుంది. సిట్యువేషనల్ కామెడీ కావడంతో సినిమా ఎక్కడా విసుగు రాలేదు. ప్రథమార్ధం పాత్రల పరిచయాలు, హీరోహీరోయిన్లు కలవడం, విడిపోవడం, దానికి సంబంధించిన పరిస్థితుల నేపథ్యంలో సాగింది. సమస్యలు సీరియస్‌వే అయినా.. చెప్పడం మాత్రం వినోదంగా చెప్పాడు. ఈ కథలో విలన్ పాత్ర గురించి ప్రత్యేకించి చెప్పాలి. చిరంజీవి సినిమాల్లో విలన్ అంటే అత్యంత శక్తిమంతుడిగా, ప్రమాదకారిగా కనిపిస్తాడు. కానీ ఈ సినిమాలో ప్రధాన విలన్ ఓ కామన్ మ్యాన్ కావడం

విశేషం. అతను విలన్‌గా మారే పరిస్థితులు కూడా లాజికల్‌గానే అనిపిస్తాయి. అసలు విలన్ కామన్ మ్యాన్ అవ్వడం వల్లే ఈ కథలో ఆసక్తి ఇంకాస్త పెరిగిందనాలి.ద్వితీయార్ధం కొంతభాగం కాస్త సీరియస్ వేలో సాగినా.. చివరి 20 నిమిషాలు వెంకటేశ్ ఎంట్రీతో సినిమా మళ్లీ వినోదంవైపు టర్న్ తీసుకున్నది. వెంకీగౌడాగా తెరపై వెంకటేశ్ చేసిన సందడి అంతా ఇంతా కాదు. ఓ విధంగా ఆయన ఉన్నంతవరకూ తెరపై అందర్నీ డామినేట్ చేశారు. తెరపై చిరంజీవి, వెంకటేశ్ ఒకే ఫ్రేమ్‌లో సందడి చేయడం.. అభిమానులకే కాదు, సగటు ప్రేక్షకుడికి కూడా కన్నుల పండుగ అనిపించింది. శంకరవరప్రసాద్‌గా చిరంజీవి అభినయం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఇలాంటి పాత్రలు ఆయన కేక్‌వాక్. ఎప్పటిలాగే తనదైన యాక్షన్, కామెడీ, ఎమోషన్స్‌తో ఆడియన్స్‌ని అలరించారు చిరంజీవి. సరదాగా ఉన్నప్పుడు 'చంటాబ్బాయి'ని గుర్తు చేస్తూ.. అవసరమైనప్పుడు రౌడీ అల్లుడ్నీ, ఘరనామొగుడ్నీ యాదికి తెస్తూ.. పాటల్లో 'కొండవీటి దొంగ'ను.. యాక్షన్‌లో 'గ్యాంగ్ లీడర్'ని గుర్తు చేస్తూ వింటేజ్ మెగాస్టార్ తెరపై సాక్షాత్కరించారని చెప్పక తప్పదు. ఇక ఇందులో చిరంజీవికి సమానమైన పాత్ర నయనతారది. ఆ పాత్రలో ఉండే దర్పం, అభిజాత్యాన్ని అద్భుతంగా పలికించింది నయనతార. ఆమె చేయడం వల్ల ఆ పాత్రకు నిండుదనం వచ్చిందని చెప్పొచ్చు. ఇక సచిన్ ఖేడేకర్‌ది ఇందులో కీలకమైన పాత్ర. ఎప్పటిలాగే తనదైన అభినయంతో ఆయన ఆకట్టుకున్నారు. మిగతా నటీనటులంతా తమదైన పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. ఇక చివరిగా వెంకటేశ్ చివరి 20 నిమిషాలు ఆయన సినిమాలో కనిపిస్తారు. అప్పటివరకూ ఓ స్థాయిలో నడిచిన సినిమాను తన రాకతో పరుగులు పెట్టించాడు వెంకటేశ్. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ నిజంగా సూపర్బ్. చిరంజీవి, వెంకటేశ్ పాత్రల్నీ ఆయన ట్యాకిల్ చేసిన తీరు మాత్రం నిజంగా అభినందనీయం. ఇక ఈ సినిమా ప్రధాన బలాల్లో భీమ్స్ సంగీతం ఒకటి. ప్రతి పాటా జనాలకు నచ్చింది. నేపథ్య సంగీతం కూడా ఆకట్టుకునేలా ఉంది. సమొత్తంగా ఆద్యంతం తనదైన కామెడీతో గిలిగింతలు పెడుతూ.. అక్కడక్కడ ఎమోషన్స్‌తో మనసుల్ని గిల్లుతూ, అవసరమైన చోటా మెగాస్టార్ గ్రేస్‌ని నేటి తరానికి పరిచయం చేస్తూ, అభిమానులకు వింటేజ్ మెగాస్టార్‌ని గుర్తు చేస్తూ.. అద్భుతంగా సినిమాను మలిచాడు దర్శకుడు అనిల్ రావిపూడి.

# రాజాసాబ్ ప్రభాస్

## మూడ్రోజుల వసూళ్ళు.183 కోట్ల గ్రాస్



మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన 'ది రాజాసాబ్' సినిమా సోషియో ఫాంటసీ డ్రామాగా రూపొందింది. మైండ్ గేమ్ ఛాలెంజింగ్‌గా వచ్చిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లో సందడి చేస్తోంది. నైజాం ప్రీమియర్స్ పరంగా కాస్త దెబ్బ పడిన ఓవరాల్ మాత్రం సాలిడ్ స్టార్టప్ అందుకుంది రాజాసాబ్. మొదటి రోజు ప్రపంచ వ్యాప్తంగా రూ. 112 కోట్లు గ్రాస్ వసూలు చేసింది. దీంతో.. ప్రభాస్ కెరీర్లో వంద కోట్ల ఓపెనింగ్స్ రాబట్టిన 6వ సినిమాగా రాజాసాబ్ రికార్డ్ నమోదు చేసింది. మిక్స్ టాక్ వచ్చిన సరే ఎక్కడా తగ్గకుండా దూసుకెళ్తున్నాడు రాజాసాబ్. ఇక ఈ సినిమా ఫస్ట్ వీక్ రన్ ఫినిష్ చేసుకుంది. రిలీజ్ అయిన మూడు రోజులకు గాను రూ. 183 కోట్ల గ్రాస్ రాబట్టి సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇక నేటి నుండి వరుస సెలవలు కావడంతో బుకింగ్స్ లో జోరు చూపిస్తూ ఈ రోజు ముగిసేనాటికి రూ. 200 కోట్ల మార్క్ అందుకుంటుందనీ ట్రేడ్ అంచనా వేస్తుంది.

## సుప్రీంను ఆశ్రయించిన జననాయగన్



'జన నాయగన్'కు మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే విధించిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ 'జన నాయగన్' టీమ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టాలని కోరుతూ నేడు పిటిషన్ వేసింది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డును మద్రాసు హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. అయితే, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా.. విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై తాత్కాలిక స్టే విధించింది. తదుపరి విచారణను జనవరి 21వ తేదీకి వాయిదా వేసింది. ఇప్పుడీ స్టే పై చిత్రబృందం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.



# నిఖిల్ స్వయంభుపై పెరుగుతున్న అంచనాలు



విడుదలకు సిద్ధంగా ఉన్న పాన్ ఇండియా చిత్రాలో 'స్వయంభు' ఒకటి. యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ నటిస్తున్న ఈ అత్యంత ప్రతిష్టాత్మక చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తుండగా,సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ సినిమాకు ఠాగూర్ మధు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఫిబ్రవరి 13, 2026న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. అయితే తాజాగా ఈ మూవీ గురించి ఇంట్రెస్టింగ్ న్యూస్ వైరల్ అవుతుంది.పిరియాడికల్ మైథలాజికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఇంటర్వల్ సీక్వెన్స్ హైలైట్ కాబోతోందట. ఈ సీన్‌లో నిఖిల్ ఇతర ప్రధాన పాత్రల మధ్య వచ్చే యాక్షన్ విజువల్స్ చాలా వైల్డ్ గా, రా గా ఉంటాయని సమాచారం. ముఖ్యంగా ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో నిఖిల్ గెటప్, యుద్ధ సన్నివేశాల సెటప్ ప్రేక్షకులను థ్రిల్ కి గురిచేస్తాయని ఇన్సైడ్ టాక్. 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం, సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ ఈ సీన్స్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లనున్నాయట. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేయగా, ఈ లేటెస్ట్ యాక్షన్ అప్‌డేట్ నిఖిల్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది.

## 'పరాశక్తి'పై ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం

'పరాశక్తి'పై ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం చేస్తున్నారని విజయ్ అభిమానులపై నటుడు, నిర్మాత దేవ్ రామ్‌నాథ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కొందరు బుక్ మై షోలో నెగెటివ్ రివ్యూలు ఇస్తున్నారని సినిమాను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదన్నారు. నెగెటివ్ రివ్యూలకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను ఎక్స్‌లో షేర్ చేసిన ఆయన కొందరు విజయ్ ఫ్యాన్స్‌ను ఉద్దేశిస్తూ పోస్ట్ పెట్టారు. థియేటర్‌ల వద్ద ఉద్దేశపూర్వకంగా 'పరాశక్తి'కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. మీ సినిమా (జననాయగన్)కు పోటీగా మేం విడుదల చేసినందుకే ఇలా చేస్తున్నారా?. ఈ కారణంగా మా సినిమాను దెబ్బతీసే హక్కు మీకు లేదు. మేం ముందుగా విడుదల తేదీని ప్రకటించాం. మేం మీ సినిమాను అడ్డుకోవడానికి ప్రయత్నించలేదు కదా.. మరెందుకు ఇలా చేస్తున్నారు. 'జననాయగన్'కు వచ్చినట్లే మాకు కూడా సెన్సార్ సమస్యలు వచ్చాయి. విడుదలకు 18 గంటల ముందు వరకు మేం కూడా ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాం. సీబీఎఫ్‌సీ కార్యాలయానికి ఎన్నోసార్లు వెళ్లాం. నెగెటివ్ రివ్యూలు, పాత వీడియోలు ఉపయోగించి ప్రజలను ప్రభావితం చేయాలని చూడడం, థియేటర్‌లో రాజకీయ నినాదాలు చేయడం. బుక్ మై షోలో రేటింగ్ తగ్గించడం.. ఇలాంటి పనులు చేసే వారికి పోటీ అని చెప్పే హక్కు లేదు. గతేడాది విడుదలైన ఓ పెద్ద సినిమాకు కూడా ఇలానే చేశారు. ఇది ఇండస్ట్రీకి మంచిది కాదు. పరాశక్తి చాలా గొప్ప సినిమా' అని తన ఎక్స్ పోస్ట్‌లో దేవ్ రామ్‌నాథ్ రాసుకొచ్చారు.

## శోభితా ధూళిపాళ్ల....చీకటిలో !

శోభితా ధూళిపాళ్ల ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'చీకటిలో'. అమెజాన్ ప్రైమ్ వేదికగా జనవరి 23 నుంచి స్ట్రీమ్రింగ్ కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. న్యూస్ ఛానల్‌లో యాంకర్ జాబ్ మానేసి సొంతంగా ఛానల్ పెట్టి స్నేహితుల హత్యల వెనక ఉన్న కారణాన్ని కనిపెట్టే సంధ్య పాత్రలో శోభిత కనిపించారు. సోషల్ మీడియా పోస్ట్‌లో ట్యాగ్ చేసినందుకే హత్య చేశాడా.. అంటూ ఆసక్తికరమైన ప్రశ్నతో ముగించిన ఈ ట్రైలర్‌ను మీరూ చూసేయండి.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463